بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ (ఆలె ఇమ్రాన్:124)

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly BADAR Qadian

www.akhbarbadr.in

సంపాదకులు: సయ్యద్ రసూల్ నియాజ్

ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్

సంపుటి: 10

సంచిక : 42

వార్షిక చందా 600/-రూ॥

16 అక్టోబర్ 2025 క్రీ. శ. 16 ఇఖా 1404 హి. శ.

23 రబీఉస్సాని 1447 హి.ఖ.


## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు అల్లాహ్ దయతో క్షేమంగా ఉన్నారు. **(అల్ హందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ కొరకు ప్రత్యేకముగా దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ అన్వర్‌కు ఆరోగ్యవంతమైన, చురుకైన సుదీర్ఘ జీవితమును ప్రసాదించుగాకా!. ఉన్నత ఆశయ సాధనాలను నమకూర్చు గాకా!,అనుక్షణం హుజూర్‌ను రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్)*

اَللّٰھُمَّ اَیِّدۡ اِمَامَنَا بِرُوۡحِ الۡقُدُسِ وَبَارِکۡ لَنَا فِیۡ عُمُرِہٖ وَاَمۡرِہٖ

## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

وَاَنۡفِقُوۡا فِیۡ سَبِیۡلِ اللّٰہِ وَلَا تُلۡقُوۡا بِاَیۡدِیۡکُمۡ اِلَی التَّہۡلُکَۃِ ۚۖۛ وَاَحۡسِنُوۡا ۚۛ اِنَّ اللّٰہَ یُحِبُّ الۡمُحۡسِنِیۡنَ ○

(سورۃ البقرۃ:196)

**అనువాదం:** అల్లాహు మార్గములో ఖర్చు చేయుము. చేతులారా వినాశనమును కోరి తెచ్చుకోకుము. మంచినే చేయుడు. నిశ్చయముగా ఉపకారం చేయువారిని అల్లాహ్ ప్రేమించును.

**(బఖరహ్:196)**

## ఒకవేళ విభేదాలు ఏర్పడి ఐక్యతను కోల్పోయినచో నిర్భాగ్యులవుతారు.

**ఒకటి: దేవుడు ఒక్కడే అని విశ్వసింపజేయడం. రెండవది: పరస్పరం ప్రేమాను రాగాలతో, సానుభూతితో వ్యవహరింపజేయడం.**

**హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ వ మహ్దియే మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి ఉపదేశాలు:**

జమాఅత్ సభ్యుల పరస్పర ఐక్యత, ప్రేమానురాగాలను గూర్చి నేను గతంలోనే అనేక సార్లు సంభాషించాను. మీరు ఎల్లప్పుడు ఐక్యమత్యంతో, కలిసి మెలసి ఉండండి. మీరు ఒకే వ్యక్తిత్వ స్వభావంను కల్గినట్లుగా ఉండండి, లేనిచో నష్టపోతారు అని అల్లాహ్ తాలా ముసల్మానులకు బోధించాడు. పరస్పర ఐక్యతను చాటడం కోసమే నమాజ్‌లో కూడ ఒకరు మరొకరితో కలిసి నిలబడండి అని ఆదేశించడం జరిగింది. ఒకవేళ విభేదాలు ఏర్పడి ఐక్యతను కోల్పోయినచో నిర్భాగ్యులవుతారు. మీరు పరస్పరం ప్రేమానురాగాలతో వ్యవహరించండి, ఒకరి కోసం మరొకరు గోప్యముగా దుఆలు చేయండి అని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపారు. ఒకవేళ ఏ వ్యక్తి అయినా ఇతరుల కోసం గోప్యముగా దుఆలు చేసినచో నీకు కూడ అలాగే జరుగును అని దేవదూతలు దీవిస్తారు. ఇది ఎంత గొప్ప విషయం. ఒకవేళ మానవుని దుఆలు ఆమోదించ బడకున్నా కూడ చివరికి దేవదూతల దుఆలైన ఆమోదించ బడుతాయి కదా!. కావున పరస్పరం విభేదించుకోకండి అని నేను మరల హితోపదేశం చేస్తున్నాను, నచ్చజెప్తున్నాను.

నేను రెండు లక్ష్యాలతోనే పంపబడ్డాను. ఒకటి: దేవుడు ఒక్కడే అని విశ్వసింపజేయడం. రెండవది: పరస్పరం ప్రేమాను రాగాలతో, సానుభూతితో వ్యవహరింపజేయడం. అన్యులు ఆశ్చర్యపోయేలా ఆదర్శమును చూపండి. అనుచరులు రిజ్వానుల్లాహ్ అజ్మయీన్‌లలో ఈ విశిష్టతయే ఏర్పడింది. **కున్‌తుమ్ అఆదాఅన్ ఫఅల్లఫ బైన ఖులూబికుమ్** (ఆలే ఇమ్రాన్:104)సౌభ్రాతృత్వం ఒక వరము అని గుర్తుంచుకోండి!. మరల గుర్తుంచుకోండి! ఎప్పటి వరకైతే మీలోని ప్రతి ఒక్కరు తనకోసం ఇష్టపడు వాటిని తన సోదరుని కోసం ఇష్టపడనంత వరకు అతడు నా జమాఅత్‌లో పరిగణించబడడు. అతడు సమస్యలలో, ఆపదలో చిక్కుకున్నవాడగును. అతని అంతం అనుకూలంగా ఉండదు. **(మల్ఫూజాత్ సంపుటి 1, పేజి 457, ప్రచురణ 2018, ఖాదియాన్)**

**అనర్థమైన, అసంబంధమైన ఆలోచనలు, ఊహాగానాల నుండి మనస్సును, మేధస్సును దూరంగా ఉంచుతూ, వాటిని ఉన్నతమైన ఆలోచనలు, వ్యక్తిత్వ వికాస అభివృద్ధి వైపు మరల్చవలెను. తద్వారా విజ్ఞతతో కూడిన పరిజ్ఞానశక్తి పెరుగుతుంది. అదే విధముగా అల్లాహ్ తాలా యొక్క అత్యంత గొప్ప అనుగ్రహమైన మేధస్సు కూడ బలహీన పడకుండ ఉంటుంది.**

**(గత సంచిక తరువాత)**

ఇస్లాం దృష్టిలో ఇవన్నియు అనవసర ఖర్చులుగా పరిగణించబడుతాయి. వాటి ద్వార వాస్తవానికి ఏ ప్రయోజనం చేకూరదు. ఎందుకనగా కేవలం తమ సంపన్నతను చాటి చెప్పడానికే ప్రజలు ఇలాంటి వస్తువులను కొనుగోలు చేస్తారు. తమ ధనమును వృధా చేస్తారు. నాకు తెలిసినంత వరకు ఒకవేళ యూరప్ ప్రజలకు నేడు కిస్రా ఉపయోగించిన కాలీన్‌ను వేలం వేస్తున్నారని తెలిసినచో బహుశ వారు ఇందుకోసం కోటి రూపాయల వరకు కూడ ఖర్చు చేయ గలరు. కాని ముసల్మానుల దృష్టిలో అట్టి కాలీన్‌కు ఎలాంటి ప్రాధాన్యతయే లేదు. ముసల్మానులను తన ముందుకు తీసుకరండి, నేను స్వయముగా వారితో మాట్లాడుతాను అని ఒక యుద్ధంలో కిస్రా తన అధికారులను ఆదేశించాడు. అందువలన అనుచరులతో కూడిన ఒక బృంధం అతని ఆస్థాన భవనంలోకి వెళ్ళినది. ఈ ముస్లిం సైనాధిపతులు తమ మట్టిచెప్పులతో ఆకాలీన్‌పై ధర్భిని గ్రుచ్చుతూ కిస్రా వద్దకు చేరుకున్నారు. ఆ రాజు ఈ ముసల్మానుల ఇట్టి చర్యను చూసి ఆశ్చర్యపోయాడు. ఆపై మీకు సభ్యతే తెలియదా?. అని అడిగాడు. నిజానికి అతడు ఒక రాజు అయ్యి ఉండి కూడ ఒక కాలీన్‌కు ప్రాధాన్యతను ఇస్తున్నాడు. అదే ముసల్మానులు పేదవారైనప్పటికి వారు కేవలం అల్లాహ్‌కే ప్రాధాన్యతను ఇస్తున్నారు. కిస్రా వద్ద ఆ కాలీన్ ఉన్నా కూడ ముసల్మానులు దానికి ఎలాంటి ప్రాధాన్యతను ఇవ్వలేదు. నిజానికి అల్లాహ్ ఏ వస్తువుకు ప్రాధాన్యతను ఇస్తాడో ముసల్మానులు కూడ వాటికే ప్రాధాన్యతను ఇస్తారు. ఏది ఏమైనప్పటికి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలాంటి చర్య లన్నింటిని వ్యర్థమైనవని ప్రకటించారు. ఇలాంటి వ్యర్థ పనులలో తమ సమయాన్ని వృధా చేయడం, ఇలాంటి వస్తువుల కోసం తమ ధనాన్ని ఖర్చుచేయడం విశ్వాసుల కర్తవ్యం కాదని మరల తెలిపారు.

నేటి పరిస్థితుల దృష్ట్యా చూసినచో సినిమా, థియేటర్‌లు కూడ ఈ ఆదేశ పరిధిలోకే వస్తాయి. ఎందుకనగా సినిమా, థియేటర్‌ల నిర్వాహణలో దేశ సంపద యొక్క అధిక భాగం వృధా చేయబడుతుంది. యూరప్‌కు చెందిన స్వతంత్ర్య దేశాలు తమ ఆర్థిక స్థితిని మెరుగుపర్చుకోవడం కోసం ఎల్లప్పుడు అనేక విధాలుగా ప్రయత్నిస్తుంటాయి. వారి పరిస్థితి కూడ ఎలా ఉన్నదనగా, వారే ఎక్కువగా సినిమాలను, థియేటర్లను నిర్మిస్తుంటారు. తద్వారా పన్నులు చెల్లించలేని ప్రజలు కూడ సినిమాలు చూస్తూ బాగస్వాములవుతారని భావిస్తాయి. ఇలా వారి ధనము మరియు వారి సమయం రెండు కూడ సినిమా కోసం ఖర్చు చేయబడుతాయి. కాని ఇస్లాం మాత్రం మానవ జాతికి ప్రయోజనం చేకూర్చని అన్ని రకాల కార్యకలాపాలను పూర్తి స్థాయిలో నిలిపి వేస్తుంది. (8వ పేజిలో)

## మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు

■హజ్రత్ అబూజర్ రజియల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించారు. నేను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో ఉన్నాను. ప్రవక్త (స) ఉహద్ పర్వతాన్ని చూసి ఇలా అన్నారు: ఒకవేళ ఈ పర్వతాన్ని నా కోసం బంగారు పర్వతంగా మార్చబడినచో, ఇందులో ఒక దినార్ కూడ మూడు రోజుల కంటే ఎక్కువ నా వద్ద ఉంచుకోవడానికి నేను ఇష్టపడను. ఆ అప్పు తీర్చుటకైనచో నిల్వ ఉంచెదను. ప్రవక్త (స) మరల ఇలా తెలిపారు: ఎవరైతే ఈ విధముగా సంపదను ఖర్చు చేస్తారో వారిని మినహాయించి మిగిలిన వారందరు ఎంత సంపన్నులైతే అంత ఎక్కువ ఆశ పరులు.

**ఇన్నల్ అక్సరీన హుముల్ అఖల్లూన్:**

హజ్రత్ సయ్యద్ జైనులాబిద్దీన్ వలి ఉల్లాహ్ షా గారు ఇలా తెలిపారు. ఈ వాక్యము విభిన్న అర్థాలను కల్గిన సంపూర్ణ వాక్యము. దీని అర్థమేమనగా, కేవలం ధనమును సమకూర్చువారినే ధనవంతులు అనరు. నిజానికి చాలా మంది ధన వంతులు తమ సద్గుణాలను కోల్పోవడం వలన అభాగ్యులుగా మిగిలిపోతారు. అందుకే ధనమును సమకూర్చువారే ధనవంతులు కారు, చుట్టు ప్రక్కల వారిపై ఖర్చు చేయువారే అసలైన ధనవంతులు. అనగా ధార్మిక, ప్రాపంచిక ఆకాంక్షలను నెరవేర్చడం కోసం ఖర్చు చేయడంతో ధన సేకరణ లక్ష్యం నెరవేరుతుంది. ఎవరైతే ధనమును సమకూర్చుకోని, ఇతరుల హక్కులను చెల్లించడో అతడే అందరి కంటే ఎక్కువ దురదృష్టవంతుడు. కాని ఎవరైతే తన ధనముతో ఇతరుల హక్కులను నెరవేర్చుతాడో అతడే అసలైన ధనవంతుడు. ఎందుకనగా అతడే ధనము యొక్క అసలు ఉద్దేశాన్ని నెరవేర్చినవాడును. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ధనము పట్ల ఇలాంటి దృక్కోణంను కల్గియుండడం అత్యున్నత స్థాయి వివేకతకు నిదర్శనం. **(సహీ బుఖారి, కితాబుల్ ఇస్తఖ్రాజ్, సంపుటి 4, ప్రచురణ 2008, ఖాదియాన్)**

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రొప్రైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

# జుమా ప్రసంగము

**దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కాలంలో జరిగిన వివిధ యుద్ధాలను గురించి ప్రస్తావించబడింది. ఈ క్రమంలోనే, హజ్రత్ గాలిబ్ బిన్ అబ్దుల్లా లైసి రజి ఫిదక్ వారితో చేసిన యుద్ధ ప్రస్తావన గలదు. హజ్రత్ బషీర్ బిన్ సఅద్ రజి, 30 మంది వ్యక్తులతో కలిసి, హిజ్రీ 7 వ సం॥ షాబాన్ మాసంలో ఫిదక్‌లోని బను ముర్రా తెగవైపు బయలుదేరారు. బను ముర్రా తెగవారు హజ్రత్ బషీర్ బిన్ సఅద్ రజి సహచరులందరినీ హతమార్చినారు.**

---

**మరొక యుద్ధ ప్రస్తావన గలదు. ఇది హజ్రత్ షుజా బిన్ వహబ్ రజి ఆధ్వర్యంలో సయ్యి ప్రాంతంలో జరిగింది. ఈ యుద్ధం హిజ్రి 8వ సం॥, రబీఉల్ అవ్వల్ మాసంలో హజ్రత్ షుజా బిన్ వహబ్ రజి ఆధ్వర్యంలో సయ్యి ప్రాంతంలో జరిగింది. సియ్యి ప్రాంతం మదీనా నుండి 5 రాత్రుల దూరంలో మక్కా మరియు బస్రాల మధ్యలో ఉన్నది.**

---

**మరొక యుద్ధ ప్రస్తావన గలదు. ఇది హిజ్రి 8వ సం॥ రబీఉల్ అవ్వల్ మాసంలో హజ్రత్ కాఅబ్ బిన్ ఉమైర్ రజి ఆధ్వర్యంలో జాతి అత్‌లాహ్ ప్రాంతంలో జరిగింది.**

---

**ముతా యుద్ధం జమాది అల్–ఉలా 8 హిజ్రిలో జరిగింది, ఇది సెప్టెంబర్ 629 అనుగుణంగా ఉంటుంది. ముతాహ్ అనేది సిరియా సరిహద్దులోని బాల్కా ప్రాంతంలో ఉన్న ఒక పట్టణం, ఇది మదీనా నుండి దాదాపు 600 వందల మైళ్ల దూరంలో ఉంది. ఈ దండయాత్రను జైష్ అల్–ఉమారా యుద్ధం అని కూడా పిలుస్తారు, ఎందుకంటే సైన్యాన్ని పంపే ముందు, దైవ ప్రవక్త (స) యుద్ధాన్ని నడిపించడానికి ఒకటి కంటే ఎక్కువ మంది కమాండర్లను నియమించారు.**

---

**ప్రవక్త (స) హజ్రత్ జైద్ బిన్ హరిస్ రజిను 3000 మంది సైన్యానికి కమాండర్‌గా నియమించి ఇలా ఆదేశించారు: "జైద్ అమరుడైతే, జాఫర్ బిన్ అబీ తాలిబ్ సైన్యాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తాడు, ఒకవేళ జాఫర్ అమరుడైతే, అబ్దుల్లా బిన్ రవాహ్ అతని స్థానంలో సైన్యాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తాడు, మరియు అతను కూడా అమరుడైతే, ముస్లింలు తమలో తమే ఒకరిని నియమించుకున్న వ్యక్తి సైన్యాధ్యక్షుడి స్థానంలోకి వస్తారు."**

---

**ప్రవక్త (స) ఇలా అన్నారు: "నేను మిమ్మల్ని ధర్మా నిష్టాపరతను స్వీకరించమని మరియు మీ తోటి ముస్లింలతో దయతో వ్యవహరించమని ఆజ్ఞాపిస్తున్నాను. అల్లాహ్ పేరు మీద బయలుదేరి, ఆయనను తిరస్కరించే వారితో పోరాడండి. ఎవరినీ మోసం చేయవద్దు, ద్రోహంగా వ్యవహరించవద్దు మరియు ఏ శిశువును, స్త్రీని లేదా వృద్ధులను చంపవద్దు. ఏ ఖర్జూరపు చెట్టును లేదా మరే ఇతర చెట్టును నరికివేయవద్దు మరియు ఏ భవనాలను కూల్చవద్దు."**

---

**ప్రస్తుతం, నేను ఒక అమరవీరుడిని మరియు కొంతమంది మరణించిన సభ్యులను గూర్చి ప్రస్తావించాలనుకుంటున్నాను మరియు వారి జనాజ నమాజ్‌ను చదివిస్తాను. గత వారం కరాచీలో వీరమరణం పొందిన సభ్యుడు లయీక్ అహ్మద్ చీమా సాహిబ్, ఇతడు చౌదరి నజీర్ అహ్మద్ చీమా కుమారుడు. అతను ఏప్రిల్ 18న వీరమరణం పొందాడు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్.**

**రెండవ ప్రస్తావన అమతుల్ ముసవ్విర్ నూరి గారిది. వీరు డాక్టర్ మస్‌వూదుల్ హసన్ నూరి గారి శ్రీమతి. కొన్ని రోజుల క్రితం మృతి చెందారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. వీరు హజ్రత్ మిర్జా షరీఫ్ అహ్మద్ సాహెబ్ రజి గారి మనుమరాలు.**

**తదుపరి ప్రస్తావన బుర్కినా ఫాసోలో స్థానిక మిషనరీగా పనిచేసిన హసన్ సనోగో అబూ బకర్ సాహిబ్ గారిది. ఆయన ఇటీవల 63 సంవత్సరాల వయసులో మరణించారు. ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్.**

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 25 ఏప్రిల్ 2025, ( 25 షహాదత్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُولُهُ

أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔

اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔

صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కాలంలో జరిగిన వివిధ యుద్ధాలను గురించి ప్రస్తావించబడింది. ఈ క్రమంలోనే, హజ్రత్ గాలిబ్ బిన్ అబ్దుల్లా లైసి రజి ఫిదక్ వారితో చేసిన యుద్ధ ప్రస్తావన గలదు. హజ్రత్ బషీర్ బిన్ సఅద్ రజి, 30 మంది వ్యక్తులతో కలిసి, హిజ్రీ 7 వ సం॥ షాబాన్ మాసంలో ఫిదక్‌లోని బను ముర్రా తెగవైపు బయలుదేరారు. బను ముర్రా తెగవారు హజ్రత్ బషీర్ బిన్ సఅద్ రజి సహచరులందరినీ హతమార్చినారు. **(సుబూలుల్ హుదా వర్రిషాద్, సంపుటి 6, పేజి 132, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)**

ఇంతకు ముందు ప్రస్తావించడం జరిగింది. హజ్రత్ బషీర్ బిన్ సాద్ రజి అనుచరుల వీరమరణంను గురించి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తెలుసు కున్నప్పుడు, ఆయన హజ్రత్ జైద్ బిన్ అవామ్ రజిను సిద్ధం చేసి, "హజ్రత్ బషీర్ బిన్ సాద్ బృందం వీరమరణం పొందిన ప్రదేశానికి వెళ్ళండి. అల్లాహ్ మీకు విజయం ప్రసాదిస్తే, వారిలో ఎవరినీ విడిచిపెట్టవద్దు" అని అన్నారు. అంటే, అన్యాయంగా ప్రవర్తించి ముస్లింలను చంపి, అమరులను చేసిన శత్రువులలో ఎవరినీ విడిచిపెట్టవద్దు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారితో పాటు 200 మంది సహచరులను సిద్ధం చేసి, వారి కోసం ఒక జెండాను తయారు చేసి సాగనంపారు. **(సుబులుల్ హుదా వర్రిషాద్, వాల్యూమ్. 6, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరుట్, పేజీ. 140)**

హజ్రత్ గాలిబ్ బిన్ అబ్దుల్లాహ్ రజియల్లాహు అన్హు కదీర్ యుద్ధంను జయించి తిరిగి వచ్చినప్పుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ జుబైర్ రజియల్లాహు అన్హు తో మీరు ఉండండి (అనగా మీరు వెళ్ళనవసరం లేదు) అని అన్నారు. ఆ తరువాత హజ్రత్ గాలిబ్ బిన్ అబ్దుల్లాహ్ రజికు 200ల మంది అనుచరులను అప్పగిస్తూ సాగనంపారు. హజ్రత్ గాలిబ్ రజి శత్రువు వద్దకు చేరుకున్నప్పుడు, అతను హజ్రత్ ఉల్బా బిన్ జైద్ రజితో పాటు మరో 10 మంది వ్యక్తులతో కూడిన నిఘా బృందాన్ని శత్రు శిబిరం వైపు పంపాడు. వారు అక్కడ ఒక సమూహాన్ని చూశారు మరియు తిరిగి వచ్చిన తర్వాత, హజ్రత్ గాలిబ్ రజికు పరిస్థితుల గురించి తెలియజేశారు. హజ్రత్ గాలిబ్ రజి శత్రువును చూడగలిగేంత దగ్గరగా ముందుకు సాగారు. శత్రువులు విశ్రాంతి తీసుకుంటూ నిద్రలోకి జారుకున్నారు. హజ్రత్ గాలిబ్ రజి అల్లాహ్‌ను స్తుతించారు మరియు కీర్తించారు, ఆపై తమ మిత్రులను (అనగా అనుచరులను) పిలిచి ఇలా అన్నారు: "నేను మీకు అల్లాహ్‌కు భయపడమని సలహా ఇస్తున్నాను, అతను ఒక్కడే మరియు భాగస్వామి లేనివాడు." నిజానికి, అతను తన సహచరులతో ఇలా అన్నాడు: "నేను మీకు అల్లాహ్‌కు భయపడమని సలహా ఇస్తున్నాను, అతను ఒక్కడే మరియు భాగస్వామి లేడు. మీరు నా పట్ల విధేయతను చూపండి, అంతేగాని నా పట్ల అవిధేయతను చూపకండి. నా ఏ సూచనలను కూడ వ్యతిరేకించవద్దు, ఎందుకంటే విధేయత చూపని వ్యక్తి, అభిప్రాయం ఆమోధయోగ్యం కాదు." మరొక కథనంలో, ఈ మాటలు ఈ క్రింది విధంగా నమోదు చేయబడ్డాయి: "నా పట్ల అవిధేయత చూపవద్దు, ఎందుకంటే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు: 'నేను నియమించిన నాయకుడికి విధేయత చూపేవాడు నాకు విధేయత చూపువాడగను. మరియు అతనికి పట్ల అవిధేయత చూపేవాడు నా పట్ల అవిధేయత చూపేవాడగను.' కాబట్టి, మీరు నా పట్ల అవిధేయత చూపితే, మీరు మన ప్రవక్త

సల్లల్లాహు అలైహి వసల్లం పట్ల అవిధేయత చూపించినట్లే అవుతుంది." ఆ తరువాత, అతను వారి మధ్య సోదర బంధాన్ని ఏర్పరచి ఇలా అన్నాడు: "మీరు ఫలానా వ్యక్తితో ఉన్నారు మరియు ఫలానా వ్యక్తితో ఉన్నారు. మీలో ఎవరూ తమ సోదరుడి నుండి వేరు చేయబడకూడదు. మీలో ఒకరు నా దగ్గరకు వచ్చినప్పుడు నేను అతని స్నేహితుడు ఎక్కడ ఉన్నాడని అడిగితే, అతను తనకు తెలియదని సమాధానం ఇచ్చే విధంగా ఉండకూడదు." దీని తరువాత, అతను ఇలా అన్నాడు: "నేను అల్లాహ్ గొప్పవాడు అని నినాదం చేసినప్పుడు, నాతో పాటు మీరు కూడ తక్బీర్‌లు పలకండి. " ఆ తరువాత యుద్ధం ప్రారంభమైనది. ముస్లింలు శత్రువును చుట్టుముట్టారు. ఆ సమయంలో హజ్రత్ గాలిబ్ రజి అల్లాహ్ గొప్పవాడని నినాదించాడు. కావున మిగిలిన సహచరులు కూడా తక్బీర్‌లు పలికారు.ఆ తరువాత ఖడ్గాలను దూశారు. శత్రువు కూడా యుద్ధానికి సిద్ధమై బయటకు వచ్చాడు. యుద్ధం కొంత సమయం వరకు కొనసాగింది మరియు ముస్లింలు శత్రువును సులభంగా ఓడించారు. ఆ రోజు, ముస్లింల నినాదం 'అమిత్, అమిత్'. ముస్లింలు యుద్ధ సంపదగా అనేక ఒంటెలు మరియు మేకలను తీసుకువచ్చారు. ప్రతి వ్యక్తికి 10 ఒంటెలు లేదా ఒక ఒంటెకు సమానమైన 10 మేకలు లభించాయి. **(సీరతుల్ హలబియా, సంపుటి 3, దారుల్ కుతుబుల్ ఇల్మియా, బీరూట్, పేజీ. 266)**

మరొక యుద్ధ ప్రస్తావన గలదు. ఇది హజ్రత్ షుజా బిన్ వహబ్ రజి ఆధ్వర్యంలో సయ్యి ప్రాంతంలో జరిగింది. ఈ యుద్ధం హిజ్రి 8వ సంII, రబీఉల్ అవ్వల్ మాసంలో హజ్రత్ షుజా బిన్ వహబ్ రజి ఆధ్వర్యంలో సయ్యి ప్రాంతంలో జరిగింది. సియ్యి ప్రాంతం మదీనా నుండి 5 రాత్రుల దూరంలో మక్కా మరియు బస్రాల మధ్యలో ఉన్నది. **(సుబూలుల్ హుదా వర్రిషాద్, సంపుటి 6, పేజి 142, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)(షరఅ జుర్కాని అలల్ మవాహిబ్ లిద్దునియా, సంపుటి 3, పేజి 337, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)**

హజ్రత్ షుజా' రజి తండ్రి పేరు వహబ్ బిన్ రబీ'అహ్. హజ్రత్ షుజా' రజి తొలినాళ్లలోనే ఇస్లాంను స్వీకరించిన ప్రముఖ సహచరులలో ఒకరిగా పరిగణింప బడుతారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్తృత్వం ప్రకటించిన ఆరు సంవత్సరాల తర్వాత, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సూచన మేరకు ఎబిసీనియాకు వలస వెళ్ళిన రెండవ సమూహంలో చేరి, ఎబిసీనియాకు వెళ్ళారు. కొంతకాలం తర్వాత, మక్కా ప్రజలు ఇస్లాంను స్వీకరించారనే పుకారు విని హజ్రత్ షుజా' రజి ఎబిసీనియా నుండి మక్కాకు తిరిగి వచ్చారు. తరువాత, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సహచరులు మదీనాకు వలస వెళ్ళడానికి అనుమతి ఇచ్చినప్పుడు, అతను తన సోదరుడు ఉక్బా బిన్ వహబ్‌తో కలిసి మక్కా నుండి బయలుదేరి మదీనాకు వలస వచ్చారు. హజ్రత్ షుజా రజి ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లంతో పాటు బదర్, ఉహుద్ మరియు ఖందఖ్ యుద్ధం వంటి అన్ని ప్రధాన యుద్ధాలలో పాల్గొన్నారు. వారు 40 సంవత్సరాల వయస్సులోనే యమామా యుద్ధంలో అమరుడయ్యారు. **(షరఅ జుర్కాని అలల్ మవాహిబ్ లిద్దునియా, సంపుటి 5, పేజి 21, దారుల్‌కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)(ఉసదుల్ ఘాబా, సంపుటి 2, పేజి 611, సంపుటి 4, పేజి 59, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)**

ఏదేమైనా, ఈ యుద్ధ వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి: సయ్యి ప్రాంతం నుండి బనూ హవాజిన్ ఇస్లాం శత్రువులకు సహాయం చేస్తున్నారని మరియు ముస్లింలతో అనుబంధంగా ఉన్న తెగల వ్యక్తులపై మెరుపుదాడి చేస్తున్నారని, మెరుపుదాడి తరువాత, వారు అరణ్యంలో దాక్కుంటున్నారని దైవ పవిత్ర ప్రవక్త (స) కు నిరంతరం సమాచారం అందసాగింది.

హిజ్రి 8వ సంII రబీఉల్ అవ్వల్ మాసంలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ షుజా రజికు 24 మంది అనుచరులను అప్పగిస్తూ బనూ హవాజిన్‌ను అణచివేయడానికి సాగనంపారు. వీరిని బనూ అమీర్ అని కూడా పిలుస్తారు. హజ్రత్ షుజా రజి తమ మనుషులతో కలిసి రాత్రిపూట ప్రయాణించి పగటిపూట దాక్కునేవారు, ఒక ఉదయం వారు బనూ అమీర్ తెగ వారి వద్దకు ఆకస్మికంగా చేరుకున్నారు. వారిపై దాడి చేశారు. పారిపోతున్న శత్రువులను వెంబడించవద్దని హజ్రత్ షుజా రజి తమ వీరులను ఆదేశించారు. వారు పెద్ద సంఖ్యలో ఒంటెలు మరియు మేకలను స్వాధీనం చేసుకున్నారు, వాటిని వారు మదీనాకు తీసుకెళ్లారు మరియు యుద్ధ సంపదను పంపిణీ చేశారు. ప్రతి ముస్లిం తన వాటాగా 15 ఒంటెలను అందుకున్నాడు. ఈ యుద్ధ ప్రయాణం మొత్తం 15 రోజులు కొనసాగింది. **( ఘజ్వాత్-ఓ-సరయా, ముహమ్మద్ అజార్ ఫరీద్ షా, ఫరిదియా పబ్లిషర్స్, సాహివాల్, పేజీ. 415) (సీరతుల్ -హలబియా, వాల్యూం. 3, దారుల్ కుతుబుల్ -ఇల్మియా, బీరూట్, పేజి. 267)**

మరొక యుద్ధ ప్రస్తావన గలదు. ఇది హిజ్రి 8వ సంII రబీఉల్ అవ్వల్ మాసంలో హజ్రత్ కాఅబ్ బిన్ ఉమైర్ రజి ఆధ్వర్యంలో జాతి అత్‌లాహ్ ప్రాంతంలో జరిగింది. **(సుబులుల్-హుదా వర్రిషాద్, వాల్యూం. 6, దారుల్ కుతుబుల్ ఇల్మియా, బీరూట్, పేజి. 143)**

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ కాఅబ్ బిన్ ఉమైర్ ఘిఫారి రజి ను సిరియా ప్రాంతంలోని, ఖురా ఘాటి వెనకాల, ముతాహ్ సమీపంలో ఉన్నటు వంటి జాతే అత్‌లాహ్ కు పంపారు. ఈ ప్రాంతం మదీనా నుండి సుమారు 600 మైళ్ళ దూరంలో ఉన్నది.

హజ్రత్ కఅబ్ రజితో పాటు 15 మంది సహచరులు ఉన్నారు. ముస్లింలపై దాడి చేయాలనే ఉద్దేశ్యంతో బను ఖుదాహ్‌లు వాదిఉల్-ఖురాకు ఆవల ఉన్న జాతే అత్‌లాహ్ వద్ద ఒక పెద్ద సైన్యాన్ని సేకరిస్తున్నారని దైవప్రవక్తకు సమాచారం అందింది. **(బురైక్ బిన్ ముహమ్మద్, ఘజ్వా ముతాహ్ వ అల్-సరయ వ అల్-బు'ఉత్, పేజీ 219)( బాష్మిల్, ఘజ్వా ముతాహ్, నఫీస్ అకాడమీ, కరాచీ, పేజీ 325)( ముహమ్మద్ అజ్హర్ ఫరీద్ షా, ఘజ్వాత్-ఓ-సరయ, ఫరీదియ పబ్లిషర్స్, సాహివాల్, పేజీ 416)**

జాతే అత్‌లాహ్ చేరుకున్న తర్వాత, హజ్రత్ కఅబ్ రజి ఒక భారీ సైన్యాన్ని ఎదుర్కొన్నాడు. హజ్రత్ కఅబ్ రజి ఆ ప్రాంతానికి చేరుకున్నప్పుడు, శత్రువుల నుండి ఒక గూఢచారి వారిని గమనించి వెంటనే తన ప్రజలకు ముస్లిం సైన్యం సమీపిస్తున్నట్లు హెచ్చరించాడు.

శత్రువులు పెద్ద సైన్యాన్ని సిద్ధం చేసు ఏర్పాట్లు చేశారు. సైన్యం తయారైనది. సహచరులు వారిని ఇస్లాం స్వీకరించమని ఆహ్వానించారు, కానీ వారు నిరాకరించి వారిపై బాణాలు వేయడం ప్రారంభించారు. దీనిని చూసిన దైవ ప్రవక్త సహచరులు ధైర్యంగా పోరాడారు మరియు వారందరూ అమరులయ్యే వరకు పోరాటం కొనసాగించారు. తీవ్రంగా గాయపడి మృతదేహాల మధ్య పడి ఉన్న సహచరులలో ఒకరు తప్పించుకోగలిగారు. ఒక కథనం ప్రకారం, ఈ ప్రాణాలతో బయటపడిన వ్యక్తి హజ్రత్ కఅబ్ బిన్ ఉమైరా అని గలదు. **(సీరతుల్-హలాబియా, వాల్యూమ్. 3, దార్ అల్-కోటోబ్ అల్-ఇల్మియా, బీరుట్, పేజీ. 267)( ముహమ్మద్ అజార్ ఫరీద్ షా, ఘజ్వాత్-ఓ-సరయ, ఫరీదియా పబ్లిషర్స్, సహివాల్, పేజీ. 416)( సుబుల్ అల్-హుదా వా అల్-రషద్, వాల్యూమ్. 6, దార్ అల్-కోటోబ్ అల్-ఇల్మియా, బీరుట్, పేజీ. 143)**

ఏదేమైనా, అతను ఒక రాత్రివేళ ప్రయాణించి, ఏమి జరిగిందో తెలియజేయడానికి పవిత్ర ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు తిరిగి వచ్చాడని నమోదు చేయబడింది. ఈ వార్త దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కు తీవ్ర దుఃఖాన్ని కలిగించింది. **(కితాబ్ అల్-మఘాజీ లి అల్-వకీది, వాల్యూమ్. 2, దార్ అల్-కోటోబ్ అల్-ఇల్మియా, బీరుట్, పేజీ. 202)**

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వెంటనే సైన్యాన్ని పంపాలని అనుకున్నాడు, కానీ శత్రువులు ఆ ప్రదేశం నుండి దూరంగా వెళ్ళారని తెలుసుకున్న తర్వాత, వారు ఆ ప్రణాళికను వాయిదా వేశారు. **(సీరతుల్-హలాబియా, వాల్యూమ్. 3, దార్ అల్-కోటోబ్ అల్-ఇల్మియా, పేజీ. 267)**

ముతా యుద్ధం జమాది అల్-ఉలా 8 హిజ్రిలో జరిగింది, ఇది సెప్టెంబర్ 629 అనుగుణంగా ఉంటుంది. ముతాహ్ అనేది సిరియా సరిహద్దులోని బాల్కా ప్రాంతంలో ఉన్న ఒక పట్టణం, ఇది మదీనా నుండి దాదాపు 600 వందల మైళ్ల దూరంలో ఉంది. ఈ దండయాత్రను జైష్ అల్-ఉమారా యుద్ధం అని కూడా పిలుస్తారు, ఎందుకంటే సైన్యాన్ని పంపే ముందు, దైవ ప్రవక్త (స) యుద్ధాన్ని నడిపించడానికి ఒకటి కంటే ఎక్కువ మంది కమాండర్లను నియమించారు. **(హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ రజి ఎం.ఏ సిరత్ ఖాతమున్ నబియ్యీన్, పేజి 740)( సుబుల్ అల్-హుదా వ అల్-రషద్, వాల్యూం. 6, దార్ అల్-కోటోబ్ అల్-ఇల్మియా, బీరూట్, పేజీ. 144)( అల్లామా బాష్మిద్, ఘజ్వాహ్ ఉచిద్ హసన్ బిన్ ముహమ్మద్ అల్-మషత్, ఇనారా అల్-దాజీ ఫి మాఘాజీ ఖైర్ అల్-వారా, దార్ అల్-మిన్హాజ్ లి అల్-నష్ వా అల్-తౌజీ', పేజి 558)**

ఈ యుద్ధం యొక్క ఉద్దేశ్యం గురించి, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం హజ్రత్ హరిస్ బిన్ ఉమైర్ రజిను బుస్రా గవర్నర్‌కు ఒక లేఖ ఇవ్వమని దూతగా పంపారు. అతను ముతా ప్రాంతానికి చేరుకున్నప్పుడు, షురహ్బిల్ బిన్ అమర్ గస్సాని అతని వద్దకు వచ్చి, "మీరు ఎక్కడికి వెళ్తున్నారు?" అని అడిగాడు. అతను, "నేను సిరియాకు వెళ్తున్నాను" అని జవాబిచ్చాడు. షురహ్బిల్, "మీరు ఏమైనా దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం దూతనా?" అని అడిగాడు. అతను, "అవును, నేను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం దూతను" అని జవాబిచ్చాడు. షురహ్బిల్ తన మనుషులను అతన్ని బంధించమని ఆదేశించాడు. ఆపై వారిని హత్య చేశారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు ఈ విషయం తెలిసినప్పుడు చాలా బాధ కల్గింది. కావున ప్రవక్త (స) అనుచరులు సమావేశ పర్చి వారికి హజ్రత్ హారిస్ బిన్ ఉమైర్ రజి వీరమరణం మరియు వారిని హత్య చేసిన వారిని గుర్చి తెలిపారు. అలా ఈ సంఘటన ముతా యుద్ధానికి దారితీసింది.

**(ఇబ్న్ సాద్, అల్-తబాకత్ అల్-కుబ్రా, వాల్యూమ్. 4, దారుల్ కుతుబుల్ -ఇల్మియా, బీరూట్, పేజీ. 255)**

హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ రజి ఈ యుద్ధానికి కారణాలు మరియు నేపథ్యాన్ని వివరిస్తూ, ఇలా వ్రాశారు, "ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం ఉమ్రా నుండి తిరిగి వచ్చినప్పుడు, యూదులు మరియు అవిశ్వాసులు సిరియా సరిహద్దులలోని క్రైస్తవ అరబ్ తెగలను రెచ్చగొట్టారు, దాని ఫలితంగా వారు మదీనాపై దాడి చేయడానికి సిద్ధమవుతున్నారని ప్రవక్తక నివేదికలు అందడం ప్రారంభించాయి. దీనికి ప్రతిస్పందనగా, ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం ఈ పుకార్ల సత్యాన్ని పరిశోధించడానికి 15 మంది వ్యక్తుల బృందాన్ని సిరియా సరిహద్దు వైపు పంపారు. "ఈ బృందం సిరియన్ సరిహద్దుకు చేరుకున్నప్పుడు, అక్కడ ఒక సైన్యం నిజంగా గుమిగూడిందని వారు చూశారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు తెలియ జేయడానికి తిరిగి రావడానికి బదులుగా, వారు ప్రచారం చేయు ఉత్సాహంలో మునిగి పోయారు – ఆ రోజుల్లో నిజమైన విశ్వాసుల లక్షణం – మరియు వారు శత్రువును ఇస్లాం వైపు ఆహ్వానించడానికి ధైర్యంగా ముందుకు వచ్చారు. అయితే, ద్వేషంతో ప్రేరేపించబడి, పవిత్ర ప్రవక్త (స) ధర్మంపై దాడి చేసి జయించటానికి సిద్ధమవుతున్న వారు దేవుని ఐక్యత సందేశంతో ప్రభావితం కాలేదు (ఈ వ్యక్తులు బోధన ద్వారా ప్రభావితం కాదు). సహచరులు ఇస్లాం బోధనలను ప్రచారం చేయడం ప్రయత్నించిన వెంటనే, అన్ని వైపుల నుండి సైనికులు తమ విల్లులను తీసి వారిపై బాణాలు వేయడం ప్రారంభించారు. "ముస్లింలు తమ బోధనలు వాదనలకు, ఆధారాలు చర్చలతో సమాధానం ఇవ్వకుండా బాణాలతో సమాధానం ఇస్తున్నారని చూసినప్పుడు, వారు పారిపోలేదు, లేదా వందలాది మంది సమూహాల నుండి తమ ప్రాణాలను కాపాడుకోలేదు. బదులుగా, నిజమైన విశ్వాసులుగా, ఆ 15 మంది పురుషులు వందలాది మంది సైనికులకు వ్యతిరేకంగా నిలబడ్డారు మరియు వారిలో ప్రతి ఒక్కరూ అక్కడే అమరులయ్యారు.

నేడు, ఈ ముస్లింలు అని పిలవబడే వారు అహ్మదీలను కూడా అదే విధంగా చూస్తారు.

"ఈ అనాగరిక చర్యకు పాల్పడిన వారిని శిక్షించడానికి దైవప్రవక్త (స) మరొక సైన్యాన్ని పంపాలని కోరుకున్నారు. ఈలోగా, అక్కడ గుమిగూడిన శత్రు దళాలు ఇప్పుడు చెల్లాచెదురయ్యాయి అనే వార్త ప్రవక్త (స)కు అందింది. అందువలన, ప్రవక్త (స) ప్రస్తుతానికి తన ప్రణాళికను మార్చుకున్నారు.

"ఆ సమయంలోనే దైవ ప్రవక్త (స) రోమన్ సామ్రాజ్యం అధికారంలో బుస్రాను పరిపాలించిన ఘస్సాన్ తెగ నాయకుడికి ఒక లేఖ రాశారు, లేదా బహుశా రోమన్ సామ్రాజ్య అధికారి కైసర్ కు స్వయంగా రాసి ఉండవచ్చును. ఈ లేఖలలో ఈ సంఘటనకు సంబంధించిన ఫిర్యాదు ఉండవచ్చు, కొన్ని సిరియన్ తెగలు ఇస్లామిక్ భూభాగంపై దాడి చేయడానికి ఎలా సిద్ధమవుతున్నాయో మరియు వారు 15 మంది ముస్లింలను కారణం లేకుండా చంపారని వివరిస్తుంది. అలాంటి ఒక లేఖ అల్-హరిస్ అనే సహచరుడికి అప్పగించబడింది, అతను సిరియా వైపు ప్రయాణించి ముతాహ్ అనే ప్రదేశంలో బస చేశాడు. అక్కడ, వారికి కైసర్ నియమించిన ఘస్సాన్ తెగ నాయకుడు సెర్జీల్ ఎదురు పడ్డాడు. " హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ రజి సెర్జీల్ అనిరాశారు, కానీ వారి అసలు పేరు షురాహ్‌బిల్ కాబట్టి ఇది టైపోగ్రాఫికల్ దోషం అని నేను నమ్ముతున్నాను. "అతను వారిని అడిగాడు, 'మీరు ఎక్కడికి వెళ్తున్నారు? బహుశా మీరు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సందేశాన్ని తెచ్చారా?' వారు నిశ్చయంగా అవును అని సమాధానం ఇచ్చాడు, ఆ సమయంలో అతను వారిని పట్టుకుని, కట్టివేసి, కొట్టి చంపాడు. ఈ వివరాలు చరిత్ర పుస్తకాలలో ప్రస్తావించబడనప్పటికీ, ఈ వ్యక్తి – అంటే షురహ్బిల్ అనే వ్యక్తిని – గతంలో 15 మంది సహచరులను హత్య చేసిన అదే సైన్యం నాయకులలో ఒకరని ఈ ఘటన తెల్పుతుంది. అందువల్ల, అతను నీవు దైవ ప్రవక్త ప్రతినిధి వా అని అడగడం ద్వార తెలియునదేమనగా, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ ప్రాంతంలో ఉన్నవారు ముస్లింలపై దాడి చేస్తున్నారని కైసర్‌కు ఫిర్యాదు ుజేస్తారని అతడు భయపడ్డాడని తెలుస్తుంది. ఈ విషయంపై దర్యాప్తును నివారించడానికి, రాజుకు ఎటువంటి నివేదిక చేరకుండా లేదా తదుపరి దర్యాప్తు జరగకుండా ఉండటానికి రాయబారిని చంపడం తనకు మంచిదని అతను నిర్ధారించాడు. కానీ సర్వశక్తిమంతుడైన దేవుడు అతని దుష్ట ఉద్దేశాలను నెరవేర్చడానికి అనుమతించలేదు మరియు ఏదో ఒక విధంగా హరిస్ హత్య చేయబడిన వార్త అల్లాహ్ ప్రవక్తకు చేరుకుంది. ప్రవక్త (స) మునుపటి అన్యాయ సంఘటనకు మరియు తరువాత జరిగిన సంఘటనకు ప్రతిచర్యగాహజ్రత్ జైద్ బిన్ హరిస్ రజి ( విముక్తి పొందిన బానిస) నాయకత్వంలో సిరియా వైపు 3000 మంది ముస్లింల సైన్యాన్ని పంపారు. **(దిబాచా తఫ్సీరుల్ ఖురాన్, అన్వర్-ఉల్-ఉలుమ్, వాల్యూమ్. 20, పేజీలు. 331-333)**

ఈ యుద్ధానికి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కమాండర్ల నియామకాన్ని ఈ క్రింది విధంగా ప్రస్తావించారు:

ప్రవక్త (స) హజ్రత్ జైద్ బిన్ హరిస్ రజిను 3000 మంది సైన్యానికి కమాండర్‌గా నియమించి ఇలా ఆదేశించారు: "జైద్ అమరుడైతే, జాఫర్ బిన్ అబీ తాలిబ్ సైన్యాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తాడు, ఒకవేళ జాఫర్ అమరుడైతే, అబ్దుల్లా బిన్ రవాహ్ అతని స్థానంలో సైన్యాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తాడు, మరియు అతను కూడా అమరుడైతే, ముస్లింలు తమలో తమే ఒకరిని నియమించుకున్న వ్యక్తి సైన్యాధ్యక్షుడి స్థానంలోకి వస్తారు."

ఈ సందర్భంగా నుమాన్ అనే యూదుడు అక్కడ ఉన్నాడు. అతను ఇలా అన్నాడు, "ఓ అబుల్-ఖాసిమ్! (యూదులు ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లంను ఇలా సంబోధించేవారు) మీరు నిజమైన ప్రవక్త అయితే, మీరు ఎవరి పేరు చెప్పారో – వారు కొద్దిమంది అయినా లేదా చాలా మంది అయినా – అందరూ అమరులవుతారు." ఆ వ్యక్తి ఇలా అన్నాడు, "ఇశ్రాయేలు ప్రవక్తలు సైన్యానికి కమాండర్లను నియమించి, ఫలానా వ్యక్తి మరణిస్తే, ఫలానా వ్యక్తి అతని స్థానంలోకి రావాలని చెప్పినప్పుడు, వారు 100 పేర్లను జాబితా చేప్పినా, వారందరూ అమరులవుతారు." అప్పుడు అతడు జైద్ వైపు దృష్టి మరల్చి, "జైద్, నువ్వు నీ వీలునామా రాసుకోవాలి ఎందుకంటే ముహమ్మద్ (స) నిజమైన ప్రవక్త అయితే, నువ్వు ఖచ్చితంగా సజీవంగా తిరిగి రాలేవు." హజ్రత్ జైద్ రజి ఇలా అన్నారు. "వారు నిజంగా నిజమైన మరియు స్వచ్ఛమైన ప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను."

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సైన్యానికి సైన్యాధిపతులను నియమిస్తు న్నప్పుడు, హజ్రత్ జాఫర్ రజి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తో, "ఓ అల్లాహ్ ప్రవక్త!, నా తల్లిదండ్రులను మీ కోసం బలి అవుదురు గాకా!. మీరు జైద్‌ను నాపై సైన్యాధిపతిగా నియమిస్తారని నేను అనుకోలేదు. (అంటే, జైద్ ఒక గొప్ప కుటుంబానికి చెందినవాడు, కానీ అతను నియమించబడలేదు) దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం, "నువ్వు బయలుదేరాలి, ఎందుకంటే ఎవరు నిజంగా ఉన్నతమైనవారో నీకు తెలియదు." అని సమాధానం ఇచ్చారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ జైద్ రజి కు తెల్ల జెండాను అందజేసి, హరిస్ బిన్ ఉమైర్ బలిదానం జరిగిన ప్రదేశానికి చేరుకున్న తర్వాత ప్రజలను ఇస్లాం వైపు ఆహ్వానించమని ఆదేశించారు. వారు అంగీకరిస్తే, అంతా బాగానే ఉంటుంది. లేకపోతే, అల్లాహ్ సహాయం కోరండి మరియు వారిని యుద్ధంలో పాల్గొనేలా చేయండి. **(సుబుల్ అల్-హుదా వా అల్-రషద్, వాల్యూమ్. 6, దార్ అల్-కోటోబ్ అల్-ఇల్మియా, బీరుట్, పేజీ. 145)( షర్హ్ అల్-జుర్కానీ అలా అల్-మవాహిబ్ అల్-లదున్యా, వాల్యూమ్. 3, దార్ అల్-కోటోబ్ అల్-ఇల్మియా, బీరుట్, పేజీలు. 340-342)( సహీహ్ అల్-బుఖారీ, కితాబ్ అల్-మఘాజీ, బాబ్ ఘజ్వా ముతా, హదీత్ 4261)**

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారందరికీ వీడ్కోలు పలికి వారికి సలహా ఇచ్చారు.

దీని గురించి మరిన్ని వివరాలు ఉన్నాయి. వారు సన్నాహాలు చేసారు మరియు సైన్యం మదీనా నుండి దాదాపు 3 మైళ్ల దూరంలో ఉన్న జుర్ఫ్ అనే ఒక ప్రదేశంలో సమావేశమైంది. దైవ ప్రవక్త కూడా బయలుదేరుతున్న సైన్యాన్ని వీడ్కోలు పలికేందుకు తనియతుల్ వాది వరకు వెళ్ళారు.

వారు యుద్ధానికి బయలుదేరే ముందు, దైవ ప్రవక్త ముస్లిం సైన్యానికి వరుస సూచనలు ఇచ్చారు. ప్రవక్త (స) ఇలా అన్నారు:

"నేను మిమ్మల్ని ధర్మా నిష్టాపరతను స్వీకరించమని మరియు మీ తోటి ముస్లింలతో దయతో వ్యవహరించమని ఆజ్ఞాపిస్తున్నాను. అల్లాహ్ పేరు మీద బయలుదేరి, ఆయనను తిరస్కరించే వారితో పోరాడండి. ఎవరినీ మోసం చేయవద్దు, ద్రోహంగా వ్యవహరించవద్దు మరియు ఏ శిశువును, స్త్రీని లేదా వృద్ధులను చంపవద్దు. ఏ ఖర్జూరపు చెట్టును లేదా మరే ఇతర చెట్టును నరికివేయవద్దు మరియు ఏ భవనాలను కూల్చవద్దు." **(షర్హ్ అల్-జుర్కానీ అలా అల్-మవాహిబ్ అల్-లదున్యా, వాల్యూమ్. 3, దార్ అల్-కోటోబ్ అల్-ఇల్మియా, బీరుట్, పేజీ. 342)**

మరల సైన్యాధికారులకు ఇంకా ఇలా ఆదేశించారు: "మీరు విగ్రహారాధకుడిని ఎదుర్కొన్నప్పుడు, అతన్ని మూడు ఎంపికలలో ఒకదాని వైపుకు ఆహ్వానించండి. అతను ఏది అంగీకరిస్తాడో, దానికి కట్టుబడి ఉండండి మరియు అతనికి హాని కలిగించవద్దు. మొదటది: అతని నగరం నుండి ముహాజిరిన్ నగరానికి వలస వెళ్ళమని ఆహ్వానించండి. వారు అంగీకరిస్తే, వారు ముహాజిరిన్ మాదిరిగానే హక్కులను పొందురదని మరియు బాధ్యతలను భరిస్తారని వారికి తెలియజేయండి. ఒకవేళ వారు వలస వెళ్ళడానికి నిరాకరిస్తే, వారిని గ్రామీణ ప్రాంతాల మధ్య నివసించమని ఆదేశించండి, ఎందుకంటే ఆ సందర్భంలో, ఇతర ముస్లింలకు నిర్దేశించిన విధంగా అల్లాహ్ యొక్క అదే ఆదేశాలు వారికి వర్తిస్తాయి, అయితే

వారు జిహాద్‌లో ముస్లింలతో పాల్గొనకపోతే వారికి యుద్ధ సంపదలో నుండి ఎటువంటి వాటా ఉండదు."వారు దీన్ని కూడా నిరాకరిస్తే, జిజియా రక్షణ పన్ను చెల్లించమని డిమాండ్ చేయండి. వారు అంగీకరిస్తే, వారి నుండి దానిని సేకరించండి మరియు వారికి ఎటువంటి హాని కలిగించవద్దు. కానీ వారు దీన్ని కూడా నిరాకరిస్తే, అల్లాహ్ సహాయం కోరండి మరియు వారిపై పోరాడండి. "మరియు మీరు ఒక కోటను లేదా నగరాన్ని ముట్టడిస్తే, వారు అల్లాహ్ మరియు అతని ప్రవక్త పేరు మీద భద్రతకు హామీని అభ్యర్థిస్తే, అల్లాహ్ మరియు అతని ప్రవక్త పేరు మీద వారికి అలాంటి హామిని ఇవ్వకండి. (మరో మాటలో చెప్పాలంటే, వారి పేరు మీద ఒప్పందం కుదుర్చుకోకండి). బదులుగా, వారికి మీ స్వంత హామీని ఇవ్వండి, లేదా మీ పూర్వీకుల పేరుతో. ఎందుకంటే మీరు మీ స్వంత హామీని లేదా మీ పూర్వీకుల హామీని ఉల్లంఘించినట్లయితే, అది అల్లాహ్ మరియు అతని ప్రవక్త పేరు మీద చేసిన హామిని ఉల్లంఘించడం కంటే తక్కువ తీవ్రమైనది." **(సుబులుల్-హుదా వ అల్-రషద్, వాల్యూమ్. 6, దారుల్-కోటోబ్ అల్-ఇల్మియా, బీరూట్, పేజీ. 146)**

హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ రజి దీని వివరాలను కూడా ఈ క్రింది విధంగా ప్రస్తావించారు: "దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జైద్ బిన్ హరిస్ రజిను సైన్యానికి కమాండర్‌గా నియమించారు. జైద్ అమరుడైతే, జాఫర్ బిన్ అబీ తాలిబ్ నాయకత్వం వహించాలని ఆదేశించారు. జాఫర్ కూడా అమరుడైతే, అబ్దుల్లా బిన్ రవాహ్ సైన్యాధిపతి అవుతాడు. మరియు అతను కూడా యుద్ధంలో అమరుడైతే, ముస్లింలు తమలో నుండి ఒక నాయకుడిని ఎన్నుకోవాలి అని సూచించారు.

ఆ సమయంలో, ఒక యూదుడు ఆ సభలో ఉన్నాడు. ఇది విన్న అతను, 'ఓ అబూ అల్-ఖాసిమ్! నువ్వు నిజంగా సత్యవంతుడివైతే, ఈ ముగ్గురు వ్యక్తులూ చంపబడతారు, ఎందుకంటే సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఎల్లప్పుడూ ప్రవక్త చెప్పినదంతా నెరవేరుస్తాడు' అని అన్నాడు. తరువాత, జైద్ వైపు తిరిగి, 'నేను నీకు నిజంగా చెబుతున్నాను: ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం నిజంగా దేవుని ప్రవక్త అయితే, నువ్వు ఎప్పటికీ సజీవంగా తిరిగి రాలేవు.' అని అన్నాడు.

"ప్రతిస్పందనగా, జైద్, 'నేను తిరిగి వచ్చినా, తిరిగి రాకపోయినా, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం నిజంగా దేవుని నిజమైన ప్రవక్త' అని అన్నారు.

"మరుసటి రోజు, సైన్యం ఉదయం బయలుదేరింది. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం, కొంతమంది సహచరులతో కలిసి, వారికి వీడ్కోలు పలకడానికి వారితో పాటు వెళ్ళారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన ఆశీర్వాద జీవిత కాలంలో, తమ నాయకత్వం లేకుండా ఇంత ముఖ్యమైన పని కోసం ఇంత పెద్ద సైన్యాన్ని ఎప్పుడూ ఒక ముస్లిం జనరల్ నాయకత్వంలో పంపలేదు.

"ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం వారితో పాటు నడుస్తూ, సలహాలు మరియు జ్ఞానయుక్తమైన మాటలు అందిస్తూ వచ్చారు. చివరికి, ప్రవక్త (స) వారితో పాటు మదీనా బయట ఉన్న ప్రదేశానికి వెళ్ళారు. అక్కడ నుండి వారు సైన్యానికి వీడికోలు పలికారు. మదీనా ప్రజలు సాధారణంగా తమ ప్రయాణికులకు అక్కడి నుండే వీడ్కోలు పలికేవారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం అక్కడ నిలబడి సైన్యానికి సలహా ఇస్తూ ఇలా అన్నారు,

'అల్లాహ్‌కు భయపడాలని మరియు మీతో ఉన్న ముస్లింలందరి పట్ల దయ చూపాలని నేను మిమ్మల్ని ఆజ్ఞాపిస్తున్నాను. అల్లాహ్ పేరుతో యుద్ధానికి వెళ్లి, సిరియాలో ఉన్న మీ శత్రువు మరియు దేవుని శత్రువుతో పోరాడండి. మీరు సిరియా చేరుకున్నప్పుడు, ప్రార్థనా స్థలాలలో కూర్చుని దేవుని నామాన్ని ప్రార్థించే వ్యక్తులు మీకు కనిపిస్తారు. మీరు వారితో ఏ విధంగానూ పోరాడకూడదు (వారిని కొంచెం కూడా ఇబ్బంది పెట్టవద్దు) మరియు వారికి ఎటువంటి ఇబ్బంది కలిగించవద్దు. శత్రువు దేశంలో, మీరు ఏ స్త్రీని, బిడ్డను, అంధుడిని లేదా పెద్దవారిని చంపకూడదు. ఏ చెట్టును నరికివేయవద్దు లేదా ఏ భవనాన్ని నాశనం చేయవద్దు. ' ఈ మార్గదర్శకత్వంతో, ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం అక్కడి నుండి తిరిగి వచ్చారు మరియు సైన్యం సిరియా వైపు బయలుదేరింది. **(దిబాచా తఫ్సీరుల్ ఖురాన్, అన్వర్-ఉల్-ఉలమ్, వాల్యూం. 20, పేజీలు. 333-334)**

మరొక సందర్భంలో, హజ్రత్ ముస్లేహ్-ఎ-మౌవూద్ రజి ఈ సంఘటన గురించి మరిన్ని వివరాలను పేర్కొన్నారు. మొత్తం కథనాన్ని ప్రస్తావించిన తర్వాత, వారు రజి ఇలా అన్నారు: " అల్లాహ్ మహత్యం వలన ఈ సంఘటన ముందే చెప్పినట్లుగానే జరిగింది. (అంటే, పవిత్ర ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చెప్పిన విధంగానే జరిగింది. మొదట, హజ్రత్ జైద్ హతమార్చబడ్డారు, ఆ తర్వాత హజ్రత్ జాఫర్ రజి సైన్య పగ్గాలు చేపట్టారు. వారు కూడా హతమార్చబడ్డారు మరియు వారి తర్వాత, హజ్రత్ అబ్దుల్లా బిన్ రవాహ్ రజి సైన్యానికి నాయకత్వం వహించారు. వారు కూడా హతమార్చబడ్డారు, మరియు ముస్లింల బృందం ప్రోద్బలంతో హజ్రత్ ఖలీద్ బిన్ వలీద్ రజి జెండాను పట్టుకున్నప్పుడు సైన్యం చెల్లాచెదురుగా ఉండేను. కాని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అతని ద్వారా వారికి విజయాన్ని ప్రసాదించాడు మరియు అతను సైన్యాన్ని సురక్షితంగా తిరిగి తీసుకురాగలిగాడు." **(ఫరిజా-ఎ-తబ్లిగ్ ఔర్ అహ్మదీ ఖవాతిన్, అన్వర్-ఉల్-ఉలం, వాల్యూమ్. 18, పేజీ. 406)**

ఈ సంఘటనకు సంబంధించిన మరిన్ని కథనాలు తరువాత ప్రస్తావించబడుతాయి, ఇన్షా-అల్లాహ్.

ప్రస్తుతం, నేను ఒక అమరవీరుడిని మరియు కొంతమంది మరణించిన సభ్యులను గుర్చి ప్రస్తావించాలనుకుంటున్నాను మరియు వారి జనాజ నమాజ్‌ను చదివిస్తాను. గత వారం కరాచీలో వీరమరణం పొందిన సభ్యుడు లయీక్ అహ్మద్ చీమా సాహెబ్, ఇతడు చౌదరి నజీర్ అహ్మద్ చీమా కుమారుడు. అతను ఏప్రిల్ 18న వీరమరణం పొందాడు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. ఒక గుంపు అతనిపై దాడి చేసి అతన్ని దారుణంగా హత్య చేసింది. మృతుడి వయస్సు 47 సంవత్సరాలు.

నివేదికల వివరాల ప్రకారం, సంఘటన జరిగిన రోజు, ప్రత్యర్థులు గుంపుగా గుమిగూడి అహ్మదియా హాల్ వెలుపల గందరగోళం సృష్టించడం ప్రారంభించారు. అది శుక్రవారం, మరియు పరిస్థితిని పరిశీలించడానికి లయీక్ చీమా సాహిబ్‌ను పంపారు. మృతుడు సంఘటనా స్థలానికి చేరుకున్నాడు. ప్రత్యర్థులు లయీక్ చీమా సాహిబ్‌ను గుర్తించి అతనిపై దాడి చేశారు. వారు అతన్ని చాలా దూరం ఈడ్చుకెళ్లి కూడలికి తీసుకెళ్లారు. అక్కడ, వారు అతన్ని ఇటుకలు మరియు రాళ్లతో కొట్టారు. ఆయనను దారుణంగా హత్య చేశారు. ఆయన తుది శ్వాస విడిచేటప్పుడు, అక్కడ ఉన్న ఒక దుకాణదారుడు ఆయనకు తాగడానికి కొంత నీరు ఇవ్వడానికి ప్రయత్నించాడు, కానీ ఆయనను బలవంతంగా ఆపారు. సంఘటన జరిగిన 30 నిమిషాల కంటే ఎక్కువ సమయం ఆలస్యం తర్వాత పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు, ఆ తర్వాత మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు, అక్కడ ఆయన మరణం నిర్ధారించబడింది.

మృతుని కుటుంబంలో అహ్మదీయత్ వారి ముత్తాత, బహవాల్ నగర్ జిల్లాలోని చిష్టియన్ కు చెందిన గౌరవనీయ చౌదరి హకీమ్ అలీ సాహిబ్ ద్వారా చేరుకున్నది. హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ అవ్వల్ రజికాలంలో బైఅత్ చేసే అదృష్టం ఆయనకు లభించింది మరియు అహ్మదీయత్ వర్గంలో చేరాడు. మృతునికి అంతగా విద్య లేకపోయినప్పటికి అతను తన సొంత వర్క్‌షాప్‌ను ప్రారంభించాడు మరియు కార్లు మరియు మోటార్‌సైకిళ్లను మరమ్మతు చేసేవాడు. అతని వర్క్‌షాప్ బాగా విస్తరించింది. అతని మంచి మరియు నిజాయితీ గల ఖ్యాతి కారణంగా, వివిధ ప్రభుత్వ విభాగాల కార్లను అతని వర్క్‌షాప్‌లో మరమ్మతు కోసం తీసుకు రాబడేవి. దీని కారణంగా, అతనికి విస్తారమైన సామాజిక పరిచయం ఉండేది. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ దయవల్ల, అమరవీరుడు వసియ్యత్ చేశాడు. అతను జమాత్ కోసం సేవ చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేవాడు. అతను తహజ్జుద్ ప్రార్థనతో పాటు ఐదు రోజుల ప్రార్థనలు చేయడంలో క్రమం తప్పకుండా చేసేవాడు. ప్రార్థనలు చేయడానికి అతను తన పిల్లలను క్రమం తప్పకుండా తనతో తీసుకెళ్లేవాడు. తన వర్క్‌షాప్‌లోని అహ్మదీ కార్మికులను, ఇంట్లో తన కుటుంబ సభ్యులను మీరు నమాజ్‌లు చేశారా? అని అడిగి తెలుసుకునేవాడు. తన పనిలో బిజీగా ఉన్నప్పటికీ, అతను తన పనిని వదిలి నమాజ్‌లకు ప్రాధాన్యత ఇచ్చేవాడు. అతను తన పనిలో నిమగ్నమై ఉన్నాడని కాదు – కాదు. సాధారణంగా, ఈ రకమైన పని చేసి బిజీగా మారేవారు నమాజ్‌లకు తగిన శ్రద్ధ ఇవ్వరు. అయితే, అతను ఎప్పుడూ నమాజ్‌లు చేయడంలో ఆలస్యం చేసేవాడు కాదు. అతను చాలా స్నేహపూర్వకంగా మరియు ప్రేమగా ఉండేవాడు. అతను అందరితో సన్నిహిత సంబంధాలను కొనసాగించాడు. ఖిలాఫత్‌తో అతనికి ప్రత్యేక బంధం ఉంది. అతను ఎంటిఏలోని కార్యక్రమాలను, ముఖ్యంగా ఎంటిఏలో ప్రసారమైన నా ప్రసంగాలను వినేవాడు. జమాత్ కేసులకు హాజరు కావడానికి మరియు ఎప్పుడైనా విధిని నిర్వహించడానికి అతను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేవాడు. అతని హత్యా సంఘటనకు రెండు రోజుల ముందు, అతను కోర్టులలో ప్రత్యర్థుల నుండి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొన్నాడు మరియు అతను బెదిరింపులకు గురయ్యాడు. అతనికి అప్పటికే బెదిరింపులు వస్తున్నాయి. అతనికి పవిత్ర ఖురాన్ పట్ల అపారమైన ప్రేమ ఉండేది. అతనికి మొదట్లో బాగా చదవడం తెలియకపోయినా, అతను పెద్దయ్యాక పవిత్ర ఖురాన్ నేర్చుకున్నాడు మరియు తరువాత అతను దానిని క్రమం తప్పకుండా పఠించేవాడు మరియు దాని రికార్డింగ్‌లను వినేవాడు. ఆయన తన వర్క్‌షాప్‌లో పవిత్ర ఖురాన్ రికార్డింగ్‌ను ఉంచుకునేవారు.

హత్యా ఘటనకు ముందు, ఎవరో మిత్రుడు అనారోగ్యం కారణంగా తనకు రక్తదానం కోసం ఏర్పాట్లు చేయమని కోరారు. దీనిపై, మృతుడు స్పందిస్తూ శుక్రవారం జుమా నమాజ్ తర్వాత, నేను వచ్చి నీ కోసం నా సొంత రక్తాన్ని దానం చేస్తానని చెప్పాడు. అయితే, దేవునికి వేరే ప్రణాళికలు ఉన్నాయి మరియు

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆయనకు వీరమరణపు ఖ్యాతిని ప్రసాదించాడు.

ఆయనకు ఇద్దరు భార్యలు ఉన్నారు. ఆయన మొదటి భార్య మరియం లైక్ ఇలా అంటోంది, "ఆయన నా అవసరాలను తీర్చారు. ఆయన పిల్లలను అద్భుతమైన రీతిలో పెంచారు మరియు నమాజ్‌ల పట్ల చాలా శ్రద్ధ వహించారు." రెండవ భార్య కూడా చెబుతుంది – ఇద్దరూ సోదరీమణుల వలె కలిసి జీవించేలా ఆయన మమ్ములను తయారు చేసుకున్నాడు – "ఆయనకు పెద్దగా ప్రాపంచిక విద్య లేకపోయినా, ఆయన సాధారణ జ్ఞానం చాలా విస్తృతమైనది. ఆయన తరచుగా ప్రవక్తల గురించి మాట్లాడేవారు. ఆయన నాకు వివిధ విషయాల గురించి కూడా నేర్పించేవాడు ఈ విషయం రెండవ భార్య, ఫరా లైక్ తెలిపారు. నాకు విద్యా బుద్ధులు నేర్పించాడు. మా వివాహం తర్వాత రెండు సంవత్సరాలలో నా భర్త నాకు నేర్పించిన విధంగా నా తల్లిదండ్రులు నాకు నేర్పించలేదు."

మృతుని సోదరుడు ఇలా తెలిపాడు. తన సోదరుడు చెప్పిన దాని గురించి మాట్లాడుతూ, "నా సోదరుడు అమరవీరుల గురించి పదే పదే మాట్లాడేవాడు మరియు అదృష్టవంతులు మాత్రమే ఈ ఆశీర్వాదం పొందుతారని చెబుతాడు. అలాంటి త్యాగం చేయాల్సిన సమయం వస్తే, అతను తన ఛాతీకి బుల్లెట్ తీసుకుంటానని అతను తరచుగా చెప్పేవాడు." ఇంకా ఇలా తెలిపాడు. "ఎటువంటి వ్యతిరేకత ఉన్నా, అతను ఎల్లప్పుడూ తన సోదరులను మసీదులో నమాజ్ చేయమని చెప్పేవాడు ఎందుకంటే ఇదే ఓపిక చూపించాల్సిన సమయం."

అతని కుమారుడు హిజ్కీల్ అహ్మద్, కేవలం 12 సంవత్సరాలు. "నా తండ్రి ఎప్పుడూ చింతించవద్దని చెప్పాడు. అందుకే నా తండ్రి అమరవీరుడైనప్పుడు నేను అస్సలు చింతించలేదు." అతను గొప్ప ధైర్యం, సంకల్పం మరియు ఓర్పును ప్రదర్శించాడు. "నేను నా తండ్రిలాగే ధైర్యవంతుడిని మరియు నా ఛాతీకి బుల్లెట్ తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాను" అని అతను తెలిపాడు.

మృతుడికి ఇద్దరు భార్యలు, ఏడుగురు పిల్లలు, ఒక సోదరి మరియు ఒక సోదరుడు ఉన్నారు. అతని పెద్ద కుమార్తె వయస్సు 17 సంవత్సరాలు, అతని చిన్న కుమార్తె వయస్సు ఒకటిన్నర సంవత్సరాలు. అతను తన భార్యకు మరొక బిడ్డ పుడతాడని చూసిన కల గురించి చెప్పాడు. అందుకు అతని రెండవ భార్య నేను పరీక్ష చేయించుకున్నప్పుడు అల్లాహ్ తనకు సంతానం ప్రసాదిస్తాడని తెలుసుకుందని చెప్పింది.

సొసైటీ అధ్యాయానికి చెందిన మిషనరీ తౌసీఫ్ సాహిబ్ ఇలా తెలిపారు. "మృతుడు నమాజ్ కేంద్రంలో రోజు 5 పూటల ప్రార్థనలు సామూహికంగా చేసేవాడు. అతను తహజ్జుద్ సల్పేవాడు. నవాఫిల్ చదివేవాడు, ఖిలాఫత్ పట్ల విధేయత చూపేవాడు, పేదలను చూసుకున్నాడు మరియు అల్లాహ్‌కు ఇవ్వవలసిన హక్కులను మరియు అతని సృష్టికి ఇవ్వవలసిన హక్కులను తన శక్తి మేరకు నెరవేర్చేవాడు. అతను తన మార్గంలో వెళుతున్నప్పుడు, ఎవరైనా అవసరంలో ఉంటే, అతను వెంటనే వారికి సహాయం చేసేవాడు. ఎవరికైనా కారు చెడిపోయిందని అతను చూస్తే, అతను తన దారిలో ఆగి వారికి సహాయం చేసేవాడు. అతను నిశ్శబ్దంగా పేదలకు సహాయం చేసేవాడు. అతను ధర్మబద్ధమైన చర్యలలో స్థిరంగా ఉండేవాడు మరియు ఎల్లప్పుడూ అన్ని విధాలుగా నిస్వార్థంగా సేవ చేసేవాడు. అతనికి సర్వశక్తిమంతుడైన దేవునిపై పూర్తి నిశ్చయత ఉంది. అతను చేసిన ప్రతిదానికీ మరియు అతను సాధించిన ప్రతి విజయానికీ సర్వశక్తిమంతుడైన దేవుని కృపకు ఆపాదించాడు. కష్టతరమైన పరిస్థితులు మరియు వ్యతిరేకత ఉన్నప్పటికీ, అతను ఎల్లప్పుడూ నమాజ్‌లను కేంద్రంలో సమయానికి సకాలంలో చేసేవాడు. అతను సున్నితమైన స్వభావం కలిగి ఉన్నాడు. ఎవరైనా అతనితో కోపంగా మాట్లాడితే, అతను మౌనంగా ఉండే వాడు మరియు వెంటనే స్పందించడు. వాస్తవానికి, అతను నవ్వుతూ వెళ్లిపోయేవాడు.

"అదే విధంగా, ఆర్థిక కార్యదర్శి లేదా స్థానిక అధ్యక్షుడు ఒకసారి వారి లెక్కలు తప్పు అని, వారు చందాల బాకీ ఉందని చెప్పారు. అయితే బకాయిలు లేవని అతను ఏమీ చెప్పలేదు మరియు చాలా పెద్ద మొత్తాన్ని చెల్లించాడు. లక్ష రూపాయలు. తరువాత, వారు లెక్కింపులో పొరపాటు పడ్డామని మరియు వాస్తవానికి అతనికి ఎటువంటి బకాయిలు లేదని, వారు అధికంగా చెల్లించారని వారికి తెలియజేశారు. అందుకు పర్వాలేదని అతను సమాధానం ఇచ్చాడు. దేవుని మార్గంలో తాను ఇప్పటికే ఇచ్చిన దానిని తిరిగి తీసుకోనన్నాడు. అతను తన కుటుంబంతో కలిసి దేశం నుండి బయటకు వెళ్లాల్సి ఉంది మరియు అన్ని సన్నాహాలు చేయబడ్డాయి. ఒక రోజు ముందు, వారు మత స్వేచ్ఛ ఉన్న దేశంకు వెళ్లబోతున్నారని అతను తనకు చెప్పాడని కథకుడు చెప్పాడు. తన పిల్లలకు అజాన్ మరియు తక్బీర్ బిగ్గరగా మరియు శ్రావ్యంగా ఎలా ఉచ్చరించాలో నేర్పించాలనేది అతని కోరిక, తద్వారా వారు ఇంట్లో సామూహికంగా ప్రార్థనలు చేస్తున్నప్పుడు, వారు బయలుదేరినప్పుడు, వారు క్రమం తప్పకుండా అజాన్‌ను పిలిచి నమాజ్‌లు చేయవచ్చు. అల్లాహ్ అమరవీరుడి స్థానాన్ని ఉన్నతీకరించి, అతని కుటుంబాన్ని తన రక్షణలో ఉంచుగాక.

శత్రువును శిక్షించడానికి ఆయన త్వరగా మార్గాలను సమకూర్చుగాకా!.

ఈ రోజు కూడా, కసూర్‌లోని ఒక గ్రామం నుండి ఒక యువ అహ్మదీ అమరవీరుడయ్యాడని ఒక నివేదిక అందింది. వివరాలు ఇంకా అందలేదు. ఈ అణచివేతదారులను శిక్షించడానికి సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మార్గాలను సమకూర్చుగాకా!. వారికి చెప్పగలిగేది ఏమిటంటే:

అల్లాహుమ్మ మజ్జిఖ్‌హుం కుల్ల ముమజ్జిఖిన్ వ సహ్హిఖ్‌హుం తస్‌హీఖన్.

రెండవ ప్రస్తావన అమతుల్ ముసవ్విర్ నూరి గారిది. వీరు డాక్టర్ మస్‌వూదుల్ హసన్ నూరి గారి శ్రీమతి. కొన్ని రోజుల క్రితం మృతి చెందారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. వీరు హజ్రత్ మిర్జా షరీఫ్ అహ్మద్ సాహెబ్ రజి గారి మనుమరాలు. మరియు హజ్రత్ నవాబ్ అమతుల్ హఫీజ్ బేగం సాహెబా రజి గారి కుమార్తే కూతురు. మరియు మిర్జా దావూద్ అహ్మద్ గారి కుమార్తే. అల్లాహ్ తాలా అనుగ్రహం వలన వసియ్యత్ చేశారు. వీరు మా పిన్నాన్న కూమార్తే.

డాక్టర్ మసూదుల్ హసన్ ఇలా తెలిపారు. "హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ స్సాలిస్ రహ్మ గారు మా వివాహానికి సహాయం చేసారు. హుజూర్ వారిని వివాహం గురించి అడగలేదు, వారి తల్లిదండ్రులను కూడా అడగలేదు. హుజూర్ గారు కేవలం నా గురించి అనగా నా వివాహాన్ని చేయాలా? అని నా తండ్రిని అడిగారు. హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ స్సాలిస్ రహ్మగారు కర్నల్ దావూద్ సాహిబ్ మరియు వారి శ్రీమతిని ఈ వివాహ ప్రతిపాదన గురించి తెలియజేసినప్పుడు, వారు కొన్ని రోజులు ఇస్తిఖారా చేయాలని అనుకుంటున్నట్లుగా చెప్పారు. అందుకు హుజూర్ రహ్మ గారు 'నేను ఇప్పటికే ఇస్తిఖారా ప్రార్థించాను మరియు ఇస్తిఖారా అవసరం లేదు. వివాహం జరగాలి.'" అన్నారు. కాబట్టి, వివాహం జరిగింది. మరల ఇలా తెలిపారు. "సర్వశక్తిమంతుడైన అల్లాహ్ దయవల్ల, మా 51 సంవత్సరాల వైవాహిక జీవితం ప్రేమ, ఆప్యాయత, విధేయత మరియు స్నేహంపూర్వంగా కొనసాగింది. ఆమె నమాజ్‌లు మరియు దుఆలు క్రమం తప్పకుండా చేసేవారు. ఆమె పేదలను బాగా చూసుకునేవారు మరియు ఆతిథ్యం ఇచ్చేవారు. ఆమెకు అల్లాహ్ పై గొప్ప నమ్మకం ఉంది. కొన్ని సంవత్సరాలుగా, ఆమె పవిత్ర ఖురాన్‌ను ప్రగాఢముగా అధ్యయనం చేయడంలో గొప్ప ఆసక్తిని పెంచుకుంది. ఆమె తరచుగా జమాత్‌లోని వివిధ పండితులను ప్రశ్నలు అడిగేవారు. ఆమె ఇతర మతాల గురించి అధ్యయనం చేయడంలో కూడా ఆసక్తి చూపించేవారు."

డాక్టర్ సాహిబ్ ఇలా తెలిపారు. , "నా జీవిత అంకితం మరియు విద్యా కార్యకలాపాలలో ఆమెకు పెద్ద పాత్ర ఉంది. ఎప్పుడైనా సంతోషకరమైన సందర్భం ఉంటే లేదా మేము ఏదేని యాత్రకు వెళ్లాల్సి వస్తే, అనుకోకుండా అత్యవసర పరిస్థితి వచ్చి నేను ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తే, ఆమె కూడ ఆ కార్యక్రమాలను వదులుకునే వారు. ఆమె గత మూడు లేదా నాలుగు సంవత్సరాలుగా చాలా అనారోగ్యంతో ఉంది మరియు ఆమె తన అనారోగ్యం మరియు అసౌకర్యాన్ని చాలా ఓపికతో భరించింది మరియు దానిని ఎప్పుడూ వ్యక్తపరచలేదు."

వారి కుమారుడు డాక్టర్ ఖలీద్ నూరి అమెరికాలో ఉండి, తాత్కాలికంగా జీవిత అంకితం క్రింద ఫజల్-ఎ-ఒమర్ ఆసుపత్రిలో సేవలందిస్తున్నారు. వారు ఇలా తెలిపారు. "మా తల్లి గారు జమాత్ యొక్క నిజాయితీగల సేవకురాలు. ఆమెకు ఖిలాఫత్ పట్ల అపారమైన ప్రేమ మరియు భక్తి ఉండేది. ఆమె ఎప్పుడూ ఎలాంటి అనవసర మరియు వ్యర్థముగా సమయాన్ని గడపలేదు. అనగా అబద్ధం, అపవాదు లేదా పనికి మాలిన ముచ్చట్లు వంటి వాటిలో సమయం వెచ్చించలేదు. ఆమె పవిత్ర ఖురాన్‌ను పూర్తి అవగాహనతో చదివింది. ఆమె హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి పుస్తకాలను కూడా అధ్యయనం చేసేది. ఆమె చాలా శ్రద్ధతో తజ్కిరా చదివేది మరియు దానిని ఎల్లప్పుడూ తన వద్ద ఉంచుకునేది. ఆమెకు చారిత్రక కళాఖండాలను సేకరించడంలో కూడా ఆసక్తి ఉంది మరియు ఆమె మ్యూజియంలు మరియు చరిత్రకారుల విశ్లేషకులతో వాటిని గురించి మాట్లాడేది." ఆమె తన ఈ అభిరుచిలో నన్ను కూడా నిమగ్నం చేసింది. ఆమె రబ్వా చుట్టూ నేలను శోధించి తవ్వించి, ముఖ్యంగా నది వెంబడి ఉన్న పర్వతాలలో వస్తువులను కనుగొంది. ఆమె లండన్‌కు వచ్చినప్పుడు, ఆమె ఈ విషయాల గురించి నాతో మాట్లాడి, నాకు విషయాలు చూపించేది. ఆమె కుమారుడు ఇంకా ఇలా వ్రాశాడు, "ఆమె పేదవారి వివాహాలకు గొప్ప ఆర్థిక సహాయం చేసేది. ఆమె కార్మికుల పిల్లలందరిని బాగా చూసుకునేది. ఆమె బాలికలకు పవిత్ర ఖురాన్ నేర్పేంది. వారి అవసరాలన్నీ తీర్చేలా చూసుకునేది మరియు ఆమె ప్రజలను కలిసినప్పుడు ఆమె ఎల్లప్పుడూ నవ్వుతూ పలుకరించేది. "

ఆమె కుమార్తె ముబారకా ఇలా చెబుతోంది, "నా తల్లికి చదవడం పట్ల మక్కువ ఉండేది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పుస్తకాలు అయినా, క్రైస్తవ మతం గురించిన పుస్తకాలు అయినా, హిందూ మతం గురించిన పుస్తకాలు

అయినా, ఆమె వివిధ అంశాల గురించి చదివి చాలా జ్ఞానాన్ని సంపాదించేది. ఆమెకు జీవిత భక్తుల పట్ల గొప్ప గౌరవం ఉంది. ఆమె ఎల్లప్పుడూ నా తండ్రికి మద్దతు ఇచ్చింది."పదవీ విరమణ తర్వాత, డాక్టర్ సాహిబ్ తన జీవితాన్ని ఇస్లాం అహ్మదీయత్ సేవకు అంకితం చేశాడు. ఆ తర్వాత అతనికి అధిక జీతం వచ్చే ఉద్యోగం లభించే అవకాశం ఉన్నది. ఆమె ఇలా చెబుతోంది, "నా తండ్రి అహ్మదీయేతర బంధువులు కూడా సంతాపం తెల్పడం కోసం వచ్చారు, మరియు ఆమె కుటుంబాన్ని కలిసి ఉంచిందని మరియు అందరితో సంబంధం కలిగి ఉందని వారు చెప్పారు." అప్పుడు ఆమె ఇలా అంటుంది, "నా ఇంటి విషయాలను మరెక్కడా పంచుకోవద్దని, నాకు అవసరమైన వాటిని ఆ కాలపు ఖలీఫాకు రాయమని, ఖలీఫా చెప్పిన వాటిని నేను అమలు చేయాలని ఆమె నాకు సలహా ఇచ్చేది. వివాదాలు మరియు తగాదాలలో సమయాన్ని వృధా చేయవద్దని కూడా ఆమె సలహా ఇచ్చేది."

తాహిర్ హార్ట్ ఇన్స్టిట్యూట్ డ్రైవర్ జలాల్ అహ్మద్ ఖాన్ ఇలా తెలిపాడు. "ఆమె చాలా సద్గుణవంతురాలు, మంచి స్వభావం గలది, దయగలది మరియు పేదలను జాగ్రత్తగా చూసుకునేది. ప్రయాణాల సమయంలో, ఆమె ఎల్లప్పుడూ మమ్మల్ని కూడా జాగ్రత్తగా చూసుకునేది. ఆమె పవిత్ర ఖురాన్ మరియు దాని అనువాదాలని ప్లే చేసేది మరియు ప్రయాణం అంతటా దానిని వినేది." "ఆమె నా భార్య మరియు పిల్లలను కూడా చాలా జాగ్రత్తగా చూసుకునేది." అతను ఇలా అంటాడు, "మేము పెద్ద నగరాలకు వెళ్ళినప్పుడు, ఆమెను తెలిసిన దుకాణదారులు, ముఖ్యంగా ఆమె తరచుగా వచ్చే రావల్పిండి మరియు ఇస్లామాబాద్‌లలో, ఆమె చాలా కాలం తర్వాత వచ్చిందని చెబుతారు. ప్రారంభంలో, వారు అడిగినప్పుడు, ఆమె జమాత్ ఆసుపత్రి ఉన్న రబ్వాకు వెళ్లిందని మరియు ఆమె భర్త అక్కడ పనిచేస్తున్నాడని చెప్పింది. ఆమె ఈ విషయాన్ని ఎటువంటి భయం లేకుండా వారికి చెబుతుంది, అయితే మేము ఆందోళన చెందేవారము.

అల్లాహ్ ఆమెకు క్షమాపణ మరియు దయను ప్రసాదించుగాకా!.

తదుపరి ప్రస్తావన బుర్కినా ఫాసోలో స్థానిక మిషనరీగా పనిచేసిన హసన్ సనోగో అబూ బకర్ సాహిబ్ గారిది. ఆయన ఇటీవల 63 సంవత్సరాల వయసులో మరణించారు. ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. రంజాన్ మాసంలో వారు రోజువారీ పవిత్ర ఖురాన్ బోధనలను జులా భాషలో ఇచ్చేవారు, వీటిని రేడియో ఇస్లామిక్ అహ్మదియలో ప్రసారం చేసేవారు. వారు మరణించడానికి ముందు రోజు, మార్చి 22న కూడా వారు ఒక ఉపన్యాసం ఇచ్చారు. వారు బుర్కినా ఫాసోలోని బోబో-డియోలాస్సో నగరంలో తన ప్రారంభ విద్యను పొందారు మరియు ఉన్నత చదువుల కోసం మౌరిటానియాకు వెళ్లారు. అక్కడ తన ప్రాథమిక ఉన్నత విద్యను పూర్తి చేసిన తర్వాత, ఆయన ఈజిప్టులోని అల్-అజార్ విశ్వవిద్యాలయానికి వెళ్లారు. అక్కడ, అతను అరబిక్ భాషలో ప్రావీణ్యం సంపాదించాడు, ఇంటికి తిరిగి రాకముందు సాహిత్య మరియు మాట్లాడే అరబిక్ రెండింటిలోనూ అసాధారణమైన ప్రావీణ్యాన్ని సాధించాడు. అల్-అజార్‌లో చదువుకున్న తర్వాత, అతను ఐవరీ కోస్ట్‌లో స్థిరపడ్డాడు, అక్కడ వందలాది మంది విద్యార్థులు హాజరైన మతపరమైన సెమినరీని స్థాపించాడు. ఆ సమయంలో అతను ఇంకా అహ్మదీ కాకపోయినా, అతని ఉజ్వలమైన వాక్చాతుర్యం మరియు అసాధారణమైన మాట్లాడే సామర్థ్యాల కారణంగా అతను ఐవరీ కోస్ట్ అంతటా ప్రసిద్ధి చెందాడు. అహ్మదీ మిషనరీలు ఆ ప్రాంతంలో బోధించడం ప్రారంభించినప్పుడు, ప్రత్యర్థులు వారిని ఎదుర్కోవడానికి అబూ బకర్ సాహిబ్‌ను ఎంచుకున్నారు. వారు తన వాక్చాతుర్యంలో చాలా గర్వపడ్డాడు. చర్చ జరిగిన రోజున, అహ్మదీలను ఓడించడం వల్ల తనకు కీర్తి, ప్రతిష్ట మరియు భక్తి లభిస్తాయని నమ్మి, అతను నమ్మకంగా ఒక పెద్ద వస్త్రాన్ని ధరించాడని అతను ఒకసారి గుర్తుచేసుకున్నాడు. అయితే, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అతనిలో సద్గుణ స్వభావాన్ని నింపాడు మరియు స్పష్టమైన మరియు బలమైన వాదనలు కలిగిన అహ్మదీల వద్ద నిజం ఉందని అతను త్వరలోనే గ్రహించాడు. అతనికి 'అల్-కౌల్-సరీహ్' అనే పుస్తకం ఇవ్వబడింది మరియు దానిని అధ్యయనం చేసిన తర్వాత, అబిద్జాన్‌లోని జమాత్ మిషనరీ అయిన అబ్దుల్ రెహమాన్ ఖానతే సాహిబ్‌తో చర్చించాడు. అల్లాహ్ అతనికి మార్గనిర్దేశం చేశాడు, మరియు అతను త్వరలోనే అహ్మదీయత్‌ను ధైర్యంగా అంగీకరించాడు. అతని బైఅత్ సంఘటన 1986లో అతనికి 24 నుండి 25 సంవత్సరాల వయస్సులో జరిగింది.

అహ్మదీయత్‌ను అంగీకరించిన తర్వాత, అతను తన మదర్సాను మరియు అతని మునుపటి ప్రాపంచిక వైభవాన్ని విడిచిపెట్టాడు. ఆ సమయంలో, ఐవరీ కోస్ట్‌లో ఫ్రెంచ్ మాట్లాడే అహ్మదీ విద్యార్థుల కోసం ఒక చిన్న కోర్సు ఉంది, అందులో అతను చేరాడు మరియు ఆ తర్వాత తన జీవితాన్ని జమాత్ సేవకు అంకితం చేశాడు. అతను త్వరలోనే జమాత్ యొక్క అత్యుత్తమ మిషనరీలలో ఒకడు అయ్యాడు, ముఖ్యంగా తన మాతృభాష అయిన జులాలో ప్రసంగాలు చేయడంలో రాణించాడు. అతని శక్తివంతమైన స్వరం మరియు ఉద్వేగభరితమైన మాట్లాడే శైలి అతని శ్రోతలను త్వరగా ఆకర్షించాయి. 1990లో, ఇద్రిస్ షాహిద్ సాహిబ్ బుర్కినా ఫాసోలో నియమించబడినప్పుడు, అతను అబూ బకర్ సనోగో సాహిబ్‌ను ఐవరీ కోస్ట్ నుండి బుర్కినా ఫాసోకు బదిలీ చేయడానికి అనుమతిని పొందాడు. ఇక్కడ, అతను ప్రచార ప్రయత్నాలలో చురుకుగా పాల్గొన్నాడు, జులా మాట్లాడే ప్రాంతాలలో వేగంగా విజయం సాధించాడు మరియు తన బోధన ద్వారా జమాత్‌లో అనేక కొత్త అధ్యాయాలను స్థాపించాడు.

1999లో, అతను బుర్కినా ఫాసోలోని డోరిలో నియమించబడ్డాడు, అక్కడ మన సభ్యులలో కొందరు అమరవీరులు అయ్యారు. అక్కడ అరబిక్ విస్తృతంగా మాట్లాడేవారు మరియు స్థానిక పండితులు అరబిక్ పరిజ్ఞానంతో ప్రజలను ఆకట్టుకోవడానికి ప్రయత్నించారు. అబూ బకర్ సాహిబ్ ఈ ప్రాంతంలోని ప్రముఖ పండితులతో విజయవంతంగా చర్చలు జరిపి, వాటిని విజయవంతంగా ఖండించారు. ఆయన మారుమూల గ్రామాలలో ఎంతగా బోధించారంటే, అహ్మదీయేతర పండితులు ఆయనతో చర్చలకు దూరంగా ఉండటం ప్రారంభించారు. త్వరలోనే, ఆయన ప్రముఖ పండితుడిగా మరియు గౌరవనీయ షేక్ గా ప్రసిద్ధి చెందారు, ఇది జమాత్ యొక్క అనేక అధ్యాయాల స్థాపనకు దారితీసింది.

1991లో, ఆయన మహదీ అబాద్‌లో అమరవీరుడు అయిన ఇమామ్ ఇబ్రహీం బాడిగ సాహిబ్ మరియు అతని స్నేహితులతో పరిచయం ఏర్పరచుకున్నారు, వారు త్వరగా అహ్మదీయత్‌ను స్వీకరించారు మరియు తరువాత 2023లో అమరవీరుల ద్వారా అహ్మదీయత్ యొక్క ప్రకాశవంతమైన తారలుగా మారారు.

2002లో, బోబో-జిలాస్సోలో మొదటి అహ్మదీయ రేడియో స్టేషన్ స్థాపించబడింది, అక్కడ అబూ బకర్ సాహిబ్ దాని ప్రముఖ వక్త అయ్యాడు. ఆయన బోధించడం పట్ల మక్కువతో కూడిన అంకితభావం అహ్మదీయత్ సందేశాన్ని లక్షలాది మందికి చేరువ చేసింది మరియు ఆయన బోధనా ప్రయత్నాల కారణంగా వేలాది మంది అహ్మదీయత్‌ను స్వీకరించారు. ఆయన అనేక సంవత్సరాలు నేషనల్ మజ్లిస్-ఎ-అమిలాలో పనిచేశారు మరియు ఆయన మరణించే సమయానికి, ఆయన కార్యదర్శి రిస్తానాతాగా పనిచేస్తున్నారు.

2012లో, వారు మాలిలోని సికాస్సోకు నియమితులయ్యారు, అక్కడ ఆయన అసాధారణ సేవలు అందించారు. 2019లో, బోబో-జిలాస్సోలో జమాత్ పరిపాలనకు వ్యతిరేకంగా కొంతమంది యువకులు అల్లర్లు సృష్టించినప్పుడు, నేను ఆయనను అక్కడికి తిరిగి పంపాను, అక్కడ ఆయన జమాత్ స్థానిక అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ధైర్యం, జ్ఞానం, కృషి మరియు ప్రార్థన ద్వారా, ఆయన అశాంతిని విజయవంతంగా ముగించారు, అందరూ తమ విశ్వాస ప్రతిజ్ఞను పునరుద్ధరించుకునేలా చేశారు.

వారు తన తల్లి, భార్య, సోదరుడు, ముగ్గురు పిల్లలు మరియు మనవరాళ్లను తన జ్ఞాపకంగా విడిచిపెట్టారు. ఆయన భార్య ఐషా కౌలిబాలి ఇలా తెలిపారు. వారు ఎల్లప్పుడూ ఇస్లాంకు సేవ చేయడానికి సిద్ధంగా ఉండేవారు. ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ, ఆయన ఎల్లప్పుడూ జమాత్ కార్యక్రమాలు మరియు ప్రచార యాత్రలకు ప్రాధాన్యత ఇచ్చేవారు. కొన్నిసార్లు ఆమె ఆరోగ్యం సరిగా లేకపోవడం వల్ల విశ్రాంతి తీసుకోవాలని ఆయనకు సలహా ఇచ్చింది, కానీ ఆయన, "నేను నా జీవితాన్ని అంకితం చేశాను మరియు నా చివరి శ్వాస వరకు విశ్వాసానికి సేవ చేయడానికి ప్రయత్నిస్తాను" అని సమాధానం ఇచ్చేవారు. వారి వివాహం నుండి, ఆయన అనారోగ్యం కారణంగా తహజ్జుద్ నిర్లక్ష్యం చేసిన రోజును తాను ఎప్పుడూ చూడలేదని ఆమె పేర్కొంది. జమాత్ లేదా మతపరమైన విషయాలతో ఎవరైనా తనను సంప్రదించినప్పుడల్లా, అతను వెంటనే వారికి సహాయం చేసేవాడు, అది తరువాత తన సొంత ఆరోగ్యాన్ని దెబ్బతీసేలా చేసినా కూడా. ఆయన కుటుంబం, పొరుగువారు మరియు పరిచయస్తులను ఎంతో దయ మరియు ప్రేమతో చూసుకున్నారు, పవిత్ర ఖురాన్ పట్ల లోతుగా అంకితభావంతో మరియు దైవ ప్రవక్త (స) పట్ల అమితమైన ప్రేమతో కూడిన ఆదర్శప్రాయమైన వ్యక్తిత్వాన్ని కలిగి ఉన్నారు.

ఇది నిజంగా జీవిత భక్తుడు మరియు మిషనరీ యొక్క నమూనా, మన మిషనరీలు ఎల్లప్పుడూ దృష్టిలో ఉంచుకోవాలి. అటువంటి అంకితభావ స్ఫూర్తిని కలిగి ఉన్న జమాత్ వ్యక్తులకు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రసాదించాలని

**నూరుల్ ఇస్లాం శాఖ:**

**అహ్మదియ్య ముస్లిం జమాఅత్‌ను గూర్చి సరైన వివరాలు తెలుసుకోవడం కోసం మీరు ఈ క్రింది టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించగలరు.**

**టోల్ ఫ్రీ నెంబర్: 1800 103 2131**

**సంప్రదించు సమయం: ప్రతిరోజు ఉదయం 08:30 నుండి రాత్రి 10:00 వరకు. (ప్రతి శుక్రవారం సెలవు).**

కోరుకుంటున్నాను.

బుర్కినా ఫాసో మాజీ అమీర్ ఇద్రిస్ షాహిద్ సాహిబ్ ఇలా తెలిపారు. అబూ బకర్ సాహిబ్ అవిశ్రాంతంగా అత్యుత్తమ బోధనా సేవలను అందించారు. ఆయన ఎల్లప్పుడూ నవ్వుతున్న ముఖం కలిగి ఉండేవారు, దృఢమైన పండిత వాదనలను ప్రదర్శించేవారు మరియు ఉన్నత ప్రమాణాల సేవను కొనసాగించడానికి నిరంతరం కృషి చేసేవారు. స్థానిక మిషనరీ దారాబ్ అల్-హసన్ గారు అబూ బకర్ సాహిబ్ దైవ ప్రవక్త (స) కు నిజమైన ప్రేమికుడు అని పేర్కొన్నారు. ఒకసారి, సూరహ్ అల్-అహ్జాబ్ లోని 38వ వచనాన్ని వివరిస్తూ, అహ్మదీయేతర పండితులు హజ్రత్ జైనబ్ తో చేసిన అసంబద్ధ వ్యాఖ్యలను చర్చిస్తున్నప్పుడు, ఆయన కళ్ళలో నీళ్ళు వచ్చాయి, సృష్టిలో అత్యుత్తముడైన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గురించి తప్పుగా ఆపాదించబడిన అజ్ఞాన, అసంబద్ధ ప్రకటనలను చూసి ఆయన బాధపడ్డాడు.

అలాంటి వ్యక్తులు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను అవమానించినప్పుడు, అది దైవదూషణగా పరిగణించబడదు, కాని అహ్మదీలు ప్రవక్త (స)ను గౌరవించడం దైవదూషణగా పరిగణించబడుతుంది. మనం ప్రవక్త (స) పేరును తీసుకున్నప్పటికీ, అది దైవదూషణగా పరిగణించబడుతుంది.

దారాబ్ సాహిబ్ తన ప్రయాణాలలో, తహజ్జద్ చేయడంలో చాలా జాగ్రత్తగా ఉండేవారని చెప్పారు. ఆయన ఖిలాఫత్ పట్ల ఎంతో అంకితభావంతో ఉండేవారు మరియు ఎల్లప్పుడూ జమాత్ వ్యవస్థను తీవ్రంగా సమర్థించారు. ఎవరైనా జమాత్‌కు వ్యతిరేకంగా మాట్లాడితే, ఆయన దానిని ఒలిచిన కత్తిలాగా రక్షించడానికి వచ్చారు. ఆయన ఎవరిపైనా ద్వేషం లేదా ద్వేషాన్ని కలిగి ఉండలేదు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆయన స్థాయిని పెంచుగాకా!c ఆయన సంతానం తన సద్గుణ వారసత్వాన్ని కొనసాగించడానికి వీలు కల్పించాలి మరియు ఆయన ప్రార్థనల ఆశీర్వాదాలను వారికి ప్రసాదించు గాకా!.

---

(1వ పేజి తరువాత ) వాటిని అనుమతించను అని సూటిగా తెబుతుంది. కావున ఒకవేళ ఇస్లాం యొక్క ఈ ఆదేశాలను పూర్తి స్థాయిలో ఆచరించినచో సంపన్నులు బాహ్యముగా కూడ కొంత మేరకు అక్రమ సంపాదనల నుండి బయటపడుతుంటారు. ఎందుకనగా అప్రయోజ, అనవసర ఖర్చులే అక్రమ సంపాదన వైపు ప్రేరేపిస్తాయి. ఈ విధముగా **హుం అనిల్లఘ్వి ముఅరిజూన్** లో ఒక నిజమైన విశ్వాసుడు కేవలం అనవసర కార్యకలాపాల నుండి దూరముండడమే కాకుండా, అనవసర ఆలోచనల నుండి కూడ దూరముండుటకు ప్రయత్నిస్తాడు అనే విషయాన్ని తెలపడం జరిగింది. వాస్తవముగా చూసినచో ఎవరైతే అసంబంధమైన ఆలోచనలకు అలవాటు పడిపోతారో, వారి మనస్సులోనే నమాజ్ చదువుతున్నప్పుడు పరిపరి విధాల తప్పుడు ఆలోచనలు వస్తుంటాయి. వాటి వలన వారి ఏకాగ్రత దెబ్బతింటుంది. ఒకవేళ తప్పుడు ఆలోచనలకు తమ మనస్సులో గాని, మధిలోగాని చోటు ఇవ్వకున్నట్లయితే, ఒకవేళ అలాంటి తప్పుడు ఆలోచనలు వచ్చిన వాటిని నివారించుటకు ప్రయత్నించినచో వారు సఫలీకృతం కాకపోవడం అనేదే ఉండదు. కాని మనకు కనిపించే విషయం ఏమిటనగా, చాలా మంది కేవలం తమ గొప్పలు చెప్పుకునే ఆలోచనలలోనే మునిగిపోయి ఉంటారు. నిజానికి వాటి వలన ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఊహభరితమైన, కల్పితమైన ఆలోచనలకు అలవాటు పడకుండా మనస్సును అడ్డుకోవాలి. వాటి వలన ఒక బలహీనత ఏర్పడుతుంది. ఒక వ్యక్తి అనర్థ ఆలోచనలకు తన మేధస్సును ఖర్చు చేసినట్లయితే, తరువాత వివేక వంతమైన ఆలోచనల స్థోమతనే కోల్పోతాడు. అందుకే అనర్థమైన, అసంబంధమైన ఆలోచనలు, ఊహాగానాల నుండి మనస్సును, మేధస్సును దూరంగా ఉంచుతూ, వాటిని ఉన్నతమైన ఆలోచనలు, వ్యక్తిత్వ వికాస అభివృద్ధి వైపు మరల్చవలెను. తద్వారా విజ్ఞతతో కూడిన పరిజ్ఞానశక్తి పెరుగుతుంది. అదే విధముగా అల్లాహ్ తాలా యొక్క అత్యంత గొప్ప అనుగ్రహమైన మేధస్సు కూడ బలహీన పడకుండ ఉంటుంది.

**(తఫ్సీరే కబీర్, 6, పేజి 125-127, ప్రచురణ 2010 ఖాదియాన్)**

---

### 130 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్

సయ్యద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 130 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్ కొరకు 26,27,28 డిశంబర్ 2025 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. ఇప్పటి నుండే జమాఅత్ సభ్యులు ఈ పవిత్ర సభలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ ఆధ్యాత్మిక సభతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక మహాసభ అన్ని విధాలా విజయవంతమగుటకు, దీని ద్వారా సత్యవంతులు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాక! **(నాజిర్ ఇస్లాహొ విర్షాద్ దక్షిణ భారత దేశపు ఖాదియాన్)**

### సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఉనికిని విశ్వసించడం వల్ల కలిగే ప్రయోజనాలు మరియు ఆశీర్వాదాలు....

గౌరవనీయులైన సభాధ్యక్షుల వారు, వేదికపై ఉన్న పెద్దలు మరియు శ్రోతలందరికి అస్సలాము అలైహికుం......

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పవిత్ర ఖురాన్‌లో మానవ జన్మ యొక్క ఉద్దేశ్యాన్ని **వమా ఖలఖ్‌తుల్ జిన్నా వల్ ఇన్‌సా ఇల్లా లి యఅబుదూన్** (జ్జారియాత్:57) అనగా మేము మానవులను మరియు జిన్నాతులను నన్ను ఆరాధించాలనే ఉద్దేశ్యంతోనే సృష్టించడం జరిగింది అని తెలిపాడు.

ఒకచోట ఇలా తెలిపాడు. **అల్లజి ఖలఖల్ మౌత వల్ హయత లి యబ్‌లువకుం అయ్యుకుం అహ్సను అమలా** (అల్ ములుక్: 3) అనగా అల్లాహ్ తాలాయే మరణాన్ని మరియు జీవితాన్ని సృష్టించిన వాడు. తద్వారా మీలో ఎవరు ప్రవర్తనలొఉత్తమమైన వారు అని అతను మిమ్మల్ని పరీక్షించ దలచాడు.

మరల ఇలాఅన్నాడు. **ఇన్నా హదైనాహు స్సబీల ఇమ్మా షాకిరన్ వ ఇమ్మా కఫూర** (సూరఅద్దుహర్ (76)" అనగా నిశ్చయముగా మేము వారికి సన్మార్గమునకు చెందిన మార్గదర్శకము చేశాము. ఎమైనప్పటికి (వారు) కృతజ్ఞతతో (నడవవచ్చును) లేదా కృతజ్ఞత రహితముగా నడవవచ్చును

మరొక చోట మానవునన్ని హెచ్చిరిస్తూ ఇలా తెలిపాడు. **అఫహసిబద్‌తుమ్ అన్నమా ఖలఖ్‌నాకుం అబసన్ వ్వ అన్నకుం ఇలైనా లా తుర్‌జ ఊన్** (మోమినీన్:116) అల్లాహ్ తాలా మానవ జాతిని ఉద్దేశించి ఇలా తెలిపాడు. మేము మిమ్ములను లక్ష్యరహితముగానే సృష్టించామని, మీరు ఎన్నటికి మా వద్దకు తిరిగి రారు అని మీరు భావిస్తున్నారా?.

పైన పేర్కొనబడిన సూక్తులన్నింటిలో అల్లాహ్ తాలా ఎంతో స్పష్టముగా " అతడు మానవులకు సన్మార్గంవైపు మార్గదర్శకం చేసినట్లుగా" తెల్పుచున్నాడు. **ఇమ్మా షాకిరన్ వ్వ ఇమ్మా కఫూర** అనగా అతడు కృతజ్ఞుడైన దాసుడిగా మారి తన జీవితపు ప్రయాణాన్ని కొనసాగిస్తాడా? లేదా కృతజ్ఞత రహితుడై తన జీవితాన్ని కొనసాగిస్తాడా? అనేది ఇక మానవుని ఇష్టం.

కోట్లాది మంది ప్రజలు అల్లాహ్ తాలాకు కృతజ్ఞత వంతులైన దాసులుగా మారి తమ జీవితపు పరమార్థ సాధనవైపు వడివడిగా అడుగులు వేస్తున్నారు. కాని మానవజాతిలో కొంత మంది మాత్రం **కఫూర** అనగా కృతజ్ఞతరహితముగానే అట్టి మార్గంలో జీవనంను కొనసాగిస్తున్నారు. వారు గర్వం, అహంకారంతో కూడిన మార్గంలో నడుస్తూ సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఉనికినే తిరస్కరిస్తున్నాడు. ఇలాంటి నాస్తికులకు మరియుకపటులకు సర్వశక్తిమంతుడైన అల్లాహు ఖుర్‌ఆన్ మజీద్‌లో ఈ విధముగా హెచ్చరించాడు. **వజరబలనా మసలన్c వ్వ నసియ ఖల్‌ఖలహు** (యాసీన్:79) మానవుడు మా ఉనికి గురించి మాట్లాడటం ప్రారంభించాడు కాని తన జన్మను మరచిపోతున్నాడు.

సయ్యదినా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం మానవజాతి మొత్తాన్ని ఉద్దేశించి ఇలా తెలిపారు. "తనకంటూ ఒక సృష్టికర్త ఉన్నాడని, అతడు అన్నింటిపై సర్వశక్తిని కల్గియున్నాడని ఇప్పటి వరకు తెలియని మానవుడు ఎంతటి దౌర్భాగ్యుడు. మనస్వర్గం మనదేవుడు, మనఅభిరుచులు మన దేవునిలోఉన్నాయి. ఎందుకంటే మేము అతనిని చూశాము మరియు అతనిలో అన్ని రకాల సౌభాగ్యములు గలవు. ప్రాణమిచ్చి సంపాదించినా ఈసంపదను తీసుకోవడం విలువైనదే, సర్వస్వాన్ని పోగొట్టుకుని సంపాదించినా ఈ ఆణిముత్యంను తప్పక కోనుగోలు చేయవలెను. ఓ అభాగ్యులారా! ఈ నీటి చెలిమవైపు పరుగెత్తండి, అది మీ దాహాన్ని తీరుస్తుంది. ఇది జీవితాన్ని ప్రసాధించు చెలిమ. ఇదే మిమ్ములను కాపాడుతుంది. నేను ఏమి చేయాలి? ఏ విధముగా ఈ శుభవార్తను ప్రజల మనస్సులో నాటదెను. ఇతడే మ ఈ దేవుడు అని ప్రజలకు తెలపడానికి నేను ఏ మద్దెల ద్వారా వీధులలో చాటింపు వేయవలెను. తద్వారా ఆలకించుటకు వారి చెవులు తెరుచుకొనుటకు నేను ఏ ఔషదం ద్వారా వారికి చికిత్స చేయవలెను. "

(కిస్తియే నూహ్, రూహాని ఖజాయిన్ సంపుటి 19, పేజి 21)

ప్రియమైన శ్రోతాలారా!. అల్లాహ్‌తాలా ఖుర్‌ఆన్ మజీద్‌లో అన్ని కాలముల వారికి ఈ విధముగా నచ్చజెప్పినాడు. అనగా వలా యుహీతూన బి షైయిన్ మ్మిన్ ఇల్‌మిహీ ఇల్లా బిమా షాఅ (బఖర: 256) ఓ మానవుడా నీవు అల్లాహ్ విజ్ఞానంను ఏ మాత్రం అంచనా వేయలేవు. కాని అల్లాహ్ తాలా స్వయముగా వ్యక్త పర్చుకున్నదే. అతని అనుగ్రహం లేనిదే నీకు ఏ విషయంను తెలుసుకునే అవకాశం ఏదేని ఆవిష్కరణలు చేయు భాగ్యము లభించదు. అల్లాహ్ తాలా కోరుకున్నచో మాత్రమే సాధ్యమవును.

గత మూడు శతబ్ధాల నుండి అల్లాహ్ తాలా మానవజాతిలో ఒక వర్గానికి చెందిన వారికే పారిశ్రామిక రంగంలో పురోగతిని సాధించు సామర్థ్యాన్ని అందించాడు.

(12వ పేజిలో )

## దేశ పాలకుల కొరకు
## హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గొప్ప ఆదర్శమూర్తులు
## (2వ భాగం)

(5) యూదులపై లేదా ముస్లిములపై ఏదేని జాతి యుద్ధమునకు దిగినచో యూదులు, ముస్లిములు పరస్పరం సహకరించుకొందురు.

(6) మదీనాపై ఎవరైనా దాడి చేసినచో అందరు కలిసి ఆ దాడిని ఎదుర్కొందురు.

(7) మక్కా ఖురైషీలకు లేదా వారి అనుయాయులకు యూదుల తరపున ఎలాంటి సహాయము లేదా ఆశ్రయము ఇవ్వకూడదు.

(8) మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అనుమతి లేనిదే ఏ ఒక్కరు యుద్ధము కొరకు వెల్లరాదు.

(9) ఈ ఒప్పందము ప్రకారము ఏ క్రూరుడు లేదా అశాంతి కారకుడు శిక్ష నుండి తప్పించుకోలేడు.

పైన ప్రస్తావించబడిన యూదుల తెగలు కొన్ని ఒప్పందములను భంగపర్చినాయి, ఔస్, ఖజ్రజ్ లోని కొందరు అన్యారాధకులు ముస్లిములతోనే కలిసి వుండుట క్షేమమని భావించి భాహ్యముగా ఇస్లాం స్వీకరించారు. కాని వారి హృదయములలో విశ్వాసము తొంగి చూడలేదని తర్వాతి సంఘటనలు నిరూపించాయి. ఎందుకనగా ప్రతి ఆపద సందర్భములో వారు తమ దాంబిక మనస్తత్వమును ప్రదర్శించిరి. ఏది ఏమైనప్పటికి ఈ ఒప్పందము వలన ముస్లిములు, యూదుల మధ్య సంబంధములు దృఢమైనవి. మదీనాలో ఒక రకమైన గట్టి క్రమ శిక్షణ, వ్యవస్థ గల ప్రభుత్వము కొలువు దీరినది. దీనికి నాయకునిగా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నియమితులైరి.

ఇటువంటి క్లిష్ట పరిస్థితులలో మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎంతో చాకచక్యంగా మదీనా ప్రభుత్వ పరిపాలన బాధ్యతలను స్వీకరించుట, అనంతరం గొప్ప ప్రవర్తనలు, సామరస్యము, సమానతలు, సంపూర్ణ న్యాయము, నిజాయితి ద్వారా పవిత్ర మదీనాను ఒక ఆదర్శవంతమైన ప్రభుత్వముగా తీర్చిదిద్దుట తమ దేశములోనే ప్రజల అధిక శాతం ఓట్ల ద్వారా ఎన్నికయ్యే లేదా నియమించబడిన ప్రతి నాయకునికి మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అద్భుత ఆదర్శముగా నిలిచిరి.

మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఆధ్యాత్మిక స్థాయి, అంతస్తును అటుంచితే ఏ ఏ ప్రత్యేక కార్యముల వలన దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఒక సఫలమైన, అందరి మన్ననలు పొందిన ప్రభుత్వ నాయకునిగా కనిపించిరో ఆయా విషయముల ఆధారంగా ఇప్పుడు నేను మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్రను ప్రస్తావించదలచితిని. కొందరు తిరుగాబాటుదారులు మినహా ఈ రాష్ట్రములోని ప్రజలు వారి సల్లం కొరకు తమ ప్రాణాలను త్యాగము చేయుటలో తమకు గర్వకారణముగా భావించేవారు.

అన్నిటికంటే ప్రత్యేకంగా కనిపించే మొదటి ప్రాముఖ్యత మత స్వతంత్రము, స్వేచ్ఛ. ఎందుకనగా విభిన్న మతములు, ఆచారములను విశ్వసించే ప్రజలు నివసిస్తున్న రాష్ట్రములో ప్రతి ఒక్కరికి తమ విశ్వాసము, అభిప్రాయమును వెల్లడించు, శాంతియుతంగా ప్రచారము చేయు, ఆచరించుటకు స్వతంత్రము వుండవలెను. మరొకరి మనసును గాయపర్చుటకు అనుమతి వుండకూడదు. ఇంతకు ముందు ప్రస్తావించినట్లు ఏకైక దేవుణ్ణి, మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను విశ్వసించే, పవిత్ర ఖుర్ఆన్ శాసనమును ఆచరించు ముస్లిములతో పాటు మూసా (అ) శాసనమును అచరించే యూదులు, ఈసా అలైహిస్సలాంను విశ్వసించే కొందరు క్రైస్తవులు, విగ్రహారాధకుల తెగలు మదీనాలో వుండెను. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కుదుర్చుకున్న ఒప్పందము మేరకు నియమములను పాటిస్తు వారు సల్లం ప్రతి ఒక్కరికి మత స్వేచ్ఛ కల్పించిరి. అందరికి నాయకులైనందుకు ప్రజల వివాదములు వారి సమక్షములో ప్రవేశపెట్టబడినప్పుడు వారి వారి మతము, శాసనము, విశ్వాసము ప్రకారము తీర్పులు వెల్లడించేవారు.

చివరికి పవిత్ర ఖుర్ఆన్ ఇట్లు ప్రకటించెను. అల్లాహ్‌ను తప్ప వారు (ప్రార్థనలలో) పిలుచువారిని మీరు తిట్టకుడు. లేనిచో వారు శత్రువులై మూఢత్వము వలన అల్లాహ్‌ను తిట్టెదరు. (అల్ అన్ఆమ్-109)

అన్యారాధకులు ఉహద్ యుద్ధము సందర్భమున ముస్లిం అమరవీరుల శవాలను అవమానపర్చిరి. హజ్రత్ హంజ కాలేయమును నోటితో కొరికిరి. కాని హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎన్నడు వారితో ప్రతీకారము తీర్చుకొనుటకు ఆలోచించక ఎల్లప్పుడు వారితో మంచిగానే ప్రవర్తించిరి.

హజ్రత్ హసన్ బిన్ అస్వద్ (రజి) ఇట్లు ఉల్లేఖించారు. ఒక యుద్ధము సందర్భమున హతులలో కొందరు పిల్లల శవాలు కూడ లభించెను. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వాకబు చేయగా ఒక వ్యక్తి ఇట్లు వేడుకొనెను. ఓ దైవ ప్రవక్త సల్లం! వీరు అన్యారాధకుల పిల్లలే కదా! బదులుగా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. గుర్తుంచుకోండి! నేడు మీలో ఉత్తములైన వారు సైతం నిన్న అన్యారాధకుల పిల్లలుగానే వుండిరి. మంచిగా గుర్తు పెట్టుకోండి! ఒక పిల్లవాడు జన్మించినప్పుడు సత్యస్వభావముతోనే జన్మించును. తర్వాత అతని తల్లిదండ్రులు అతణ్ణి యూదునిగా లేక క్రైస్తవునిగా మారుస్తారు.

(ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్ సంపుటి 6 పుట 24 బేరూత్)


ఒక ప్రభుత్వ అధికారిగా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ముఖ్యమైన రెండవ ప్రాముఖ్యత ఉత్తమ న్యాయమైన పద్ధతి. న్యాయము ప్రపంచ శాంతికి మూలము. నేడు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్న అందోళన, అశాంతికి అతిపెద్ద కారణము న్యాయము లేకపోవడమే. తమవారితోనే కాక ఇతరులతో, శత్రువులతో సైతం న్యాయము, నిజాయితిగా వ్యవహరించాలని ఇస్లాం బోధిస్తుంది. దీని గురించి మహా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర జీవిత చరిత్ర అనేక గొప్ప ఉదాహరణలతో అలంకరించబడి వున్నది. సమయ భావము వలన కేవలం రెండు సంఘటనలను మాత్రమే ప్రవేశ పెట్టెదను.

ఏ జాతులలో ప్రవర్తనలు దిగజారిపోతాయో వాటిలో పక్షపాతము, అన్యాయము అధికమైపోతుంది. క్రమ క్రమంగా ఈ విషయము పాతుకుపోతుంది. ధనికులు చట్ట వ్యతిరేక పనులకు పాల్పడినను శిక్ష నుండి తప్పించుకుంటారు. నిరుపేదలు, నిస్సహాయ సాధారణ ప్రజలు మాత్రమే శిక్షలు అనుభవిస్తారు. కాని హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం దయాసాగరులు, అనుగ్రహించువారు, కారుణ్య మూర్తులు అయినను శాసన ఆదేశములను అమలు పర్చుటలో చాలా పౌరుషము కలిగివుండిరి. న్యాయము, నిజాయితిని ఎన్నడు విస్మరించేవారు కాదు. బుఖారి షరీఫ్‌లో హజ్రత్ ఆయిషా (రజి) ద్వారా ఒక కథనము ఇట్లు ఉల్లేఖించబడెను.

"మఖ్జూమ్ తెగ వంశస్తురాలైన ఫాతిమా నామము గల ఒక మహిళ దొంగతనానికి పాల్పడెను. కావున మహా ప్రవక్త సల్లం వద్ద ఈ మహిళ విషయములో శిక్ష తగ్గింపు కొరకు సిఫారసు చేయవలెనని ప్రజలు భావించిరి. అందుకే మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు అత్యంత ప్రియమైన ఉసామా బిన్ జైద్‌ను సిద్ధము చేసిరి. వారు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వెళ్లి చాలా వినయముతో మనవి చేసిరి. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ విషయమును చాలా తప్పు బట్టారు. కోపముతో వారి ముఖము ఎర్రబారి పోయెను. వారిట్లనిరి. ఎవరైనా ధనికుడు దొంగతనము చేసినచో వదిలి పెట్టడం నిరుపేద చౌర్యమునకు పాల్పడినచో అతని చేతులను నరికివేయడం ఇస్రాయీల్ సంతతి వారి అలవాటుగా మారిపోయెను. కాని నా పరిస్థితి ఏమనగా ఎవరి చేతిలో నా ప్రాణమున్నదో అతని ప్రమాణముగా ఒక వేళ ముహమ్మద్ కుమార్తె ఫాతిమా కూడ దొంగతనము చేసినచో నేను ఆమె చేతులను కూడ నరికివేస్తాను. అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదిన్ వఅలా ఆలి ముహమ్మదిన్ వాబారిక్ వసల్లిమ్.

రెండవ సంఘటన ఇట్లు గలదు. బదర్ యుద్ధములో మక్కా అన్యారాధకులైన ఖైదీలలో మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చిన్నాన హజ్రత్ అబ్బాస్ (రజి) కూడ వుండిరి. ఖైదీల పర్యవేక్షణ హజ్రత్ ఉమర్ (రజి)కు అప్పగించబడినప్పుడు

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దుఆ ఆశించువారు: SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)



Love for All Hatred for None
99493-56387
Prop:Muhammad Saleem
MASROOR HOTEL
TEA,TIFFIN,MEALS,CHICKEN-BIRYANI,FAST-FOOD AVAILABLE HERE
Near Naidu Petrol Pump, Khammam Rd. Warangal (Telengana)
Mohammad Saleem (Naib Ameer Zila Jamat Ahmadiyya Warangal (Telengana)

వారు హజ్రత్ అబ్బాస్ (రజి)తో అందరి తాళ్లను గట్టిగా కట్టిరి. వీరందరు మస్జిద్ నబ్వీ ఆవరణలోనే వుండిరి. తద్వారా హజ్రత్ అబ్బాస్ (రజి) తీవ్ర నొప్పితో బాధ పడుతుండిరి. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తమ చిన్నాన మూలుగుతున్నట్లు విని తట్టుకోలేక పోయిరి. కావున వారికి నిద్ర పట్టలేదు. అన్సార్‌కు ఏదో విధంగా ఈ విషయము తెలిసిపోయినది. కనుక వారు హజ్రత్ అబ్బాస్ (రజి) తాళ్ళను వదులు చేసిరి. తద్వారా వారు మూలగడం మానేసిరి. హజ్రత్ అబ్బాస్ (రజి) మూలుగుతున్న శబ్దం ఎందుకు రావడం లేదు? అని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రశ్నించిరి. అనుచరులు ఇట్లు వేడుకొనిరి. ఓ దైవ ప్రవక్త సల్లం! మీరు బాధపడుతున్న విషయమును గమనించి మేము వారి తాళ్లను వదులు చేశాము. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఇది అన్యాయమగును. ఇతర ఖైదీలందరి తాళ్లను కూడ వదులు చేయండి లేదా అబ్బాస్ తాళ్లను కూడ గట్టిగా బిగించండి. అప్పుడు అనుచరులు మిగతా ఖైదీలందరి తాళ్లను కూడ వదులు చేశారు.

మన విధేయతార్హులు, యజమాని అయిన హజ్రత్ అఖ్దస్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర జీవిత చరిత్ర ద్వారా మనకు కనిపించే మరో ప్రత్యేకత ఏమనగా ప్రతి క్లిష్టమైన ఘడియలో తమ జాతికి మార్గదర్శనము చేయుటకు ఎల్లప్పుడు సిద్ధముగా వుండుట ఒక సఫలమైన నాయకునికి, పాలకునికి తప్పనిసరి అని నొక్కి చెప్పిరి. సాధ్యమైనంత త్వరగా సంఘటనా స్థలానికి చేరుకొని జాతికి దిశానిర్దేశం చేస్తూ జాతికి ధైర్యము చెప్పవలెను. దీని గురించి ఒక్క సంఘటన మాత్రమే ప్రవేశపెట్టుతున్నాను.

కదంకముల యుద్ధము సందర్భమున రక్షణపరంగా, యుద్ధ ఎత్తుగడల దృష్ట్యా మదీనా చుట్టు కందకములు త్రవ్వబడుతుండెను. అనుచరులు ఆకలి బాధను తట్టుకొనుటకు తమ కడుపుకు రాళ్లు కొట్టుకొని వుండిరి. త్రవ్వుతుండగా ఒక రాయి విరగడం లేకుండెను. అనుచరులు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో మార్గదర్శనము పొందాలని ఆశించిరి. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకొనిరి. అప్పుడు వారు కూడ ఆకలి బాధను తట్టుకొనుటకు తమ కడుపుకు రెండు రాళ్ళు కట్టుకొని వుండిరి. అదే స్థితిలో వారు సుత్తె తీసుకొని ఆ రాయిపై మూడు సార్లు కొట్టి, ఆ రాయిని ముక్కలు ముక్కలు చేసిరి. అల్లాహ్ మహిమ ఇంతటి బలహీన, అచేతన స్థితిలో వారికి అల్లాహ్ తఆలా ప్రతి దెబ్బకు చుట్టు ప్రక్కల వున్నటువంటి పెద్ద పెద్ద ప్రభుత్వములను ముస్లిములు జయిస్తున్నట్లు దృశ్యములను అల్లాహ్ తఆలా చూపించెను. ప్రతి దెబ్బకు అల్లాహు అక్బర్ నినాదము చేసిరి. అనంతరం సిరియా, ఈరాన్, సన్ఆ, యెమెన్ రాజభవనముల తాళం చెవులు నాకు ఇవ్వబడెనని అనుచరులకు శుభవార్త వినిపించిరి.

మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవితములోనే ఇస్లాం అరబ్ ద్వీపమంతా విజయము సాధించెను. వారు స్వర్గస్తులైన తర్వాత తొమ్మిద (9) సంవత్సరముల లోపే అరబ్ అంతటా ముస్లిముల రాజ్యము స్థిరపడినది.

ప్రముఖంగా కనిపించే మరో విశిష్టత ఏమనగా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మదీనా ప్రభుత్వాధికారిగా మారక ముందు మరియు తర్వాతి జీవితంలో ఎలాంటి వ్యత్యాసము కనిపించదు. బీద, అచేతన స్థితిలో వారు మక్కాలో ఏ విధంగా జీవితము గడిపిరో అలాగే మదీనాకు రాజుగా మారిన తర్వాత కూడ అదే సాధారణ స్థితిలో తమ జీవితము గడిపిరి. కాని ఒక వైపు ఈరానీ నాయకుల అంగరంగ వైభవము, భయభ్రాంతి మొత్తం ఆసియాలో కనిపిస్తుండెను. మరో వైపు రోమ్ ప్రభుత్వము తమ ఐశ్వర్యములు, వైభవ స్థాయిని పశ్చిమములో చూపిస్తుండెను. ఈ రెండు స్వతంత్ర ప్రభుత్వముల మధ్య నున్న అరబ్ తెగలు సైతం తమ బానిసల సేవకుల సేవలతో తమ స్థాయిని మించి తమ నాయకత్వ గొప్పతనాన్ని బహిర్గతపర్చుటకు ప్రయత్నిస్తుండిరి.

ఇటువంటి వాతావరణంలో ప్రపంచ అధినేత, శాశ్వత గర్వకారణమైన హజ్రత్ అఖ్దస్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం ఎంతో సాధారణ, సామాన్య జీవితములో ఎలాంటి మార్పులు కనిపించలేదు. ఇంతేకాక మదీనా పౌరుల అభివృద్ధి, వారి పరిస్థితిని మెరుగు పరచుటకు తమపై, తమ కుటుంబ సభ్యులపై మరిన్ని కష్టములను మోపుతుండిరి. ఇంటి పనుల కోసం ఎలాంటి సేవకుడు లేకుండెను. పనులన్ని తాము స్వయముగా చేసుకునేవారు. ఇంట్లో మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఏమి చేసేవారని హజ్రత్ ఆయిషా (రజి)ను ప్రశ్నించగా వారిట్లు సమాధానమిచ్చిరి. '**యకూను ఫీ మిహ్నతి అహ్‌లిహి ఫఇజా హజరతిస్సలాతు ఖరజ ఇలస్సలాతి**' అనగా ఇంట్లో తమ కుటుంబ సభ్యుల పనులలో సహకరించేవారు, నమాజ్ సమయము కాగానే నమాజ్ కొరకు వెళ్ళిపోయేవారు.

(బుఖారి కితాబుస్సలాత్)

ఇదెంతటి గొప్ప ఆదర్శము. రాజు అయినను తమ ఇటి పనుల కొరకు ఒక్క జీతగాన్ని పెట్టుకొనని వ్యక్తిని ఎవరినైనా చూపగలరా! అరబ్ రాజుగా వారు లక్షలాది రూపాయలు, పశువుల మందకు మందలను అవసరమున్న ప్రజలకు పంచిపెట్టారు. ఒకసారి మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్ద డెబ్బై (70) వేల దిర్‌హమ్‌లు వచ్చెను. మరొక హదీసు ప్రకారము తొంభై (90) వేల దిర్‌హమ్‌ల ప్రస్తావన గలదు. ఈ దిర్‌హమ్‌లను వారొక చాపపై పెట్టించి వాటిని పంచిపెట్టుటకు నిలబడిరి. మొత్తం పంచి పెట్టేంత వరకు అక్కడి నుండి కదలలేదు.

(అల్ వఫా బిఅహ్వాలిల్ ముస్తఫా ఇబ్నుల్ జౌజి పుట 447. బేరూత్)

ఒకసారి వారి వద్దకు ఒక వ్యక్తి వచ్చెను. వారు అతనికి మేకలతో నిండి వున్న ఒక లోయను బహుకరించిరి. ఓ నూతన ముస్లిం లోయ మధ్యలో వున్న భూమిని కూడ అడిగెను. వారు సల్లం అతనికి ఆ భూమి కంచెలను మేకల మందతో పాటు మొత్తం కానుకగా ఇచ్చి వేసిరి. ఆ వ్యక్తి తమ జాతికి తిరిగి చేరుకున్నప్పుడు ఇట్లనెను. ఓ నా జాతి ప్రజలారా! మీరందరు ఇస్లాంలో చేరండి. ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం ఇంత అధికంగా పంచిపెడ్తారు. బీదరికము, ఆకలితో వారు ఎన్నడు భయపడరు.

(మజ్‌మవుజ్జవాయిద్ హైసమీ సంపుటి 9 పుట 13 బేరూత్)

కాని తమ స్వంతానికి, తమ కుటుంబ సభ్యుల కొరకు జాతీయ నిధి నుండి ఎలాంటి ప్రయోజనము పొందేవారు కాదు. ఎంతగా జాగ్రత్త పడేవారనగా ఒకసారి వారి మనుమడు (కుమార్తె కుమారుడు) హజ్రత్ ఇమామ్ హుసేన్ (రజి) బాల్యములో ఖర్జూరముల కుప్ప నుండి ఒకటి రెండు ఖర్జూరములు తీసుకొని తమ నోట్లో వేసుకొనిరి. కాని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తక్షణమే నోట్లో వ్రేలు పెట్టి ఆ ఖర్జూరములను బయటికి తీసి వేసిరి. మనుమడా! ఇవి దానపు ఖర్జూరములు. మనకు ఇవి ధర్మబద్ధము కావు అని హితవు పలికిరి.

ఇంట్లో వున్న పరిస్థితి గురించి హజ్రత్ ఆయిషా (రజి) ఇట్లు ఉల్లేఖించారు. వారు తమ సోదరి కుమారుడైన ఉర్వ (రజి)తో ఇట్లు చెప్పిరి. "ఓ నా సోదరి కుమారుడా! మేము మొదటి రాత్రి చందమామ తర్వాత మరో చందమామను ఒక్కోసారి మూడు సార్లు చందమామను చూసేవారము. అనగా రెండు రెండు నెలలు గడిచినను మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇంట్లో పొయ్యిలో మంట పెట్టే అవసరము వచ్చేది కాదు. హజ్రత్ ఉర్వ (రజి) ఇట్లనిరి. నేనిట్లంటిని. ఓ చిన్నమ్మా! అలాంటప్పుడు మీరు ఏమి తినేది? హజ్రత్ ఆయిషా (రజి) ఇట్లు సమాధానమిచ్చిరి. ***అస్వదాని*** అనగా రెండు వస్తువులు ఒకటి ఖర్జూరము రెండవది మంచినీళ్లతో పూట గడుపుకునేవారము. కాని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇరుగుపొరుగున అన్సార్ వ్యక్తులు వుండేవారు. వారి వద్ద పాలిచ్చే మేకలు వుండేవి. వారు వాటి పాలను కానుకగా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు పంపించేవారు. వారు సల్లం ఆ పాలనే మాకు త్రాగించేవారు.

మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారాల పట్టి, స్త్రీల నాయకురాలు హజ్రత్ ఫాతిమ (రజి) పరిస్థితి ఎట్లుండెననగా ఇంట్లో ఇసుర్రాయి నడుపుతు వారి చేతులలో పొక్కులు వచ్చేవి. కొందరు బానిసలు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి

| **అహాదీస్ బోధనలు** | దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: **"ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు."** (కంజులుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671) |
|---|---|

**దుఆ ఆశించువారు: *Muhammad Nazeer Ahmad sb, warangal, (Telangana)***

| **అహాదీస్ బోధనలు** | **"ఒక మునల్మానుడి విశిష్ట లక్షణమేమనగా, తన ముసల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను." అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.** (మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్) |
|---|---|

**దుఆ ఆశించువారు: *Muhammad Vazeer Ahmad sb Babu, Mahboobnagar, (Telangana)***

వసల్లం వద్దకు వచ్చినట్లు తెలిసి ఇంటి పనులలో సహకరించుటకు ఒక బానిస కావాలని ఆమె కోరిరి. రాత్రి పొద్దుపోయాక మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తమ కుమార్తె, అల్లుని వద్దకు వచ్చి వారి మధ్య పరుపులోనే కూర్చొని ఎంతో అప్యాయతతో ఇట్లు నచ్చచెప్పిరి. మీరు అడిగిన దాని కంటే ఉత్తమమైన విషయము నేను మీకు చెప్పనా! అదేమనగా మీరు తమ పరుపులలో పడుకొన్నప్పుడు 33 సార్లు సుబహానల్లాహ్, 33 సార్లు అల్‌హందులిల్లాహ్, 34 సార్లు అల్లాహు అక్బర్ అని చదవండి. ఇది మీకు ఒక సేవకుని కంటే అధిక మేలు కల్గించును.

చెప్పుకోదగ్గ ఇంకొక విషయము ఏమనగా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్ద జాతి నిధులు వుండేవి. వాటిలో నుండి తమ కొరకు లేదా తమ కుటుంబ సభ్యుల కొరకు ఖర్చు చేయుటను వారు పాపముగా భావించేవారు. ఇంతే కాక వారి స్వంత ఉపయోగమునకు సైతం చాలా నగదు వచ్చేది. అనుచరులు తమ వినయము, అనురాగము వలన అనేక కానుకలు వారికి సమర్పించుకునేవారు. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తమ స్వంత అవసరాలకు, తమ భార్యాపిల్లల కొరకు వినియోగించుకోవాలని అనుచరులు కోరుకునేవారు. తమ తర్వాత తమ కుటుంబ సభ్యులు ఎలా జీవించగలరనే ఉద్దేశ్యముతో ఒక విలువైన నగదు, ఆస్తులు సమకూర్చుకున్నచో ఎలాంటి విమర్శించదగ్గ విషయము కాకుండెను. కాని వారు తుది శ్వాస విడిచినప్పుడు వారి ఇంటి పరిస్థితి కల్లకు కట్టినట్టు అమర్ బిన్ హారిస్ (రజి) కథనముతో స్పష్టమగుతుంది. వారిట్లు తెలిపిరి. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పరమపదించే సమయమున ఇంట్లో ఏమియును వదలలేదు. దిరహమ్, దీనార్, బానిస పురుషులు, స్త్రీలు ఏమియును లేకుండెను. ఒక్క తెల్లటి కంచర గాడిద, తమ ఆయుధములు, దానము చేసిన ఒక స్థలం మాత్రమే వుండెను.

హజ్రత్ సహల్ బిన్ సాద్ (రజి) ఇట్లు ఉల్లేఖించారు. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఏడు దీనార్లు హజ్రత్ ఆయిషా (రజి) వద్ద పెట్టుకొమ్మని ఇచ్చిరి. చివరి వ్యాధిలో ఇట్లడిగిరి. ఓ ఆయిషా! నీ వద్ద వున్నటువంటి బంగారమును ఏమి చేశావు? నా వద్దనే వున్నదని వారు వేడుకొనిరి. దానము చేయమని వారనిరి. అనంతరం వారు సల్లల్లాహు అలైహి వసల్లం స్పృహ కోల్పోయిరి. కావున హజ్రత్ ఆయిషా (రజి) వారి పనిలో నిమగ్నమైరి. స్పృహలోకి రాగానే బంగారము దానము చేశావా? అని మరల అగిడిరి. ఇంకా చేయలేదని వేడుకొనిరి. వారు దీనార్లు తెప్పించుకొని తమ చేతిలో పెట్టుకొని లెక్కబెట్టిరి. ఈ ప్రపంచమును వీడుతు అల్లాహ్‌తో భేటి అగుతున్నప్పుడు ఈ దీనార్లు నా దగ్గర వున్నచో ముహమ్మద్‌కు అల్లాహ్‌పై ఎలా నమ్మకము వున్నట్లగును? అనంతరం ఆ దీనార్లను దానము చేశారు. అదే రోజు మృతి చెందారు. (మజ్‌మవుజ్జవాయిద్ హైసమీ సంపుటి 9 పుట 13 బేరూత్) అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదిన్ వఅలా ఆలి ముహమ్మదిన్ వబారిక్ వసల్లిమ్.

వారి నిజమైన అభిమాని హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ మసీహ్ మౌవూద్ వ మహ్దీ మాహూద్ అలైహిస్సలాం వారి జీవిత చరిత్రను వివరిస్తు ఇట్లనిరి.

“...అల్లాహ్ తఆలా అనేక నిధుల తలుపులను మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కొరకు తెరిచెను. వారు సల్లం వాటన్నిటిని దైవ మార్గములో ఖర్చు చేశారు. తమ కడుపు నింపుకొనుటకు ఒక్క గింజను కూడ వాడుకోలేదు. ఎలాంటి భవనము నిర్మించలేదు, దర్బారు కట్టించలేదు. పేదల గృహముల కంటే అధిక ప్రాధాన్యత లేని మట్టితో కట్టిన ఒక చిన్న గదిలో జీవితం మొత్తం గడిపిరి. చెడు చేసినవారితో మంచి చేసి చూపారు. దుఃఖము కలిగించిన వారికి వారి ఆపద సమయంలో తమ ధనముతో సుఖ సంతోషాలు కల్పించిరి. నిద్రించుటకు అధికంగా నేలపైనే పరుపు వుండేది. నివసించుటకు చిన్న గుడిసె, భుజించుటకు జొన్నలు లేదా ఆకలితోనే సరిపెట్టుకునేవారు. ప్రాపంచిక ఆస్తి పాస్తులు తరచుగా వారికి ఇవ్వబడినవి. కాని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తమ పవిత్ర హస్తములకు ప్రాపంచిక ధూళిని అంటనివ్వలేదు. వారు తాము ధనికునిగా కాక బీదవానిగా వుండుటకు ఎల్లప్పుడు ప్రాధాన్యతనిచ్చిరి. తాము అవతరించిన దినము నుండి తమ గొప్ప మిత్రుడైన అల్లాహ్ వద్దకు చేరునంత వరకు తమ దయామయుడైన దేవుణ్ణి తప్ప మరెవరికి ప్రధాన్యతనివ్వలేదు...”

(బరాహీనె అహ్మదియ్యహ్–రూహానీ ఖజాయిన్ సంపుటి 1 పుట 289–290, ఫుట్‌నోట్ నం:11)

కనుక ఏదేని ఒక ప్రభుత్వ అధినేత, పాలకులకు వారి సల్లం స్వంత, కుటుంబ జీవితములోని ఈ విజ్ఞానవంతమైన విషయములు ఆదర్శముగా నిలుచును. ఇలా చేయనిదే వారు ప్రజల, పౌరుల హక్కులను సరియైన రీతిలో పర్యవేక్షించలేరు, చెల్లించలేరు.

నేడు ఇతర పాలకుల విషయము అటుంచితే ముస్లిం నాయకులు సైతం జాతీయ నిధులను స్వంత, కుటుంబ అవసరాల కొరకు ఎంత విచ్చలవిడిగా, ప్రస్తావించలేని విధంగా వాడుకుంటున్నారో మనము చదువుతున్నాము, వింటున్నాము, చూస్తున్నాము. అల్లాహ్ తఆలాయే వారికి సద్బుద్ధి ప్రసాదించు గాక! మన ప్రియతమ నాయకులు హజ్రత్ అఖ్దస్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర ఆదర్శములో వెయ్యో వంతును ఆచరించు అనుగ్రహము లభించినను పౌరుల స్థితులు మెరుగు పడవచ్చును.

గౌ॥ శ్రోతలారా! ఇస్లాం ఈ శాంతియుత బోధనను, మానవత్వానికి ఉపకారి అయిన హజ్రత్ అఖ్దస్ ముహ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర ఆదర్శమును మన ప్రియతమ ఇమామ్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ నేడు ప్రపంచములోని అభివృద్ధి చెందిన పెద్ద పెద్ద దేశముల చట్టసభల్లో నిలబడి తెలుపుతున్నారు. న్యాయము, ప్రపంచ ఆందోళన, అశాంతి, తీవ్రవాదమును నివారించుటకు, వేగంగా ముంచుకొస్తున్న మూడవ ప్రపంచ యుద్ధము నుండి రక్షించుకొనుటకు ప్రపంచ స్థాయి నాయకులను హెచ్చరిస్తున్నారు.

చివరలో వాటిలోని రెండు పంక్తులను మాత్రమే ప్రవేశపెట్టి నేను నా ఉపన్యాసమును ముగించెదను. 27 జూన్ 2012వ తేదీన క్యాపిటల్ హిల్ వాషింగ్టన్ డి.సి.లో హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా కాంగ్రెస్, సేంట్‌కు చెందిన ముఖ్య సభ్యులు, వైట్ హౌస్ సిబ్బంది, ప్రభుత్వేతర సంస్థల నాయకులు, వివిధ దేశ ప్రతినిధుల సమక్షములో ఉపన్యాసము చేసిరి. ఇందులో వారిట్లు హెచ్చరించిరి.

“మొదటి ప్రపంచ యుద్ధము ముగిసిన తర్వాత భవిష్యత్తులో మంచి, శాంతియుత అంతర్జాతీయ సత్సంబంధములు ఏర్పడాలని కొన్ని దేశముల నాయకులు ఆశించిరి. కావున ప్రపంచ శాంతి స్థాపనకు ఒక ప్రయత్నంగా లీగ్ ఆఫ్ నేషన్స్ ఏర్పాటు చేయనైనది. ప్రపంచములో శాంతిని ఏర్పాటు చేయుట, భవిష్యత్తులో యుద్ధములను నివారించుట దీని ప్రధాన ఉద్దేశముగా నిర్ణయించబడెను. దురదృష్టవశాత్తు ఈ లీగ్ సూత్రములు, దాని తీర్మాణములలో కొన్ని లోపములు, తప్పులు వుండెను. ఫలితముగా అది మొత్తం జాతుల హక్కులను సరియైన రీతిలో, సమానంగా రక్షించలేక పోయెను. ఈ అసమానతల వలన శాశ్వత శాంతి ఏర్పడలేదు. లీగ్ ప్రయత్నములు విఫలమైనవి. దాని ప్రత్యక్ష ఫలితముగా రెండవ ప్రపంచ యుద్ధము సంభవించినది. దాని తర్వాత జరిగిన సాటిలేని వినాశనము, విధ్వంసము మనందరికి తెలుసు. ఇందులో భాగంగా సుమారు 7 కోట్ల 50 లక్షల ప్రజలు తమ ప్రాణాలు కోల్పోయిరి. వీరిలో అధిక సంఖ్య అమాయక పౌరులదే వుండెను. ప్రపంచమునకు గుణపాఠముగా ఈ యుద్ధము సరిపోవలసి వుండెను. దీని ఫలితముగా న్యాయబద్ధంగా ఇరు పక్షములోని అందరికి సమంజసమైన హక్కులు లభించుటకు ప్రణాళికలు రచించవలసి వుండెను. తద్వారా ఈ సంస్థ ప్రపంచ శాంతికి ఒక కారణముగా రుజువయ్యేది. నిస్సందేహంగా అప్పటి ప్రభుత్వములు కొంత మేర శాంతి స్థాపనకు కృషి చేసినవి. తద్వారా ఐక్య రాజ్య సమితి ఏర్పాటైనది. కాని ఐక్య రాజ్య సమితి ప్రధాన, ముఖ్యమైన గొప్ప ఉద్దేశము కూడ పూర్తి కాలేదని త్వరలోనే తేలిపోయినది.”

| వర్తమాన ఖలీఫా వాఖ్యములు | **“అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గె ఆందోళన కూడ దూరం కాదు. ” (జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018)** |
|---|---|

**దుఆ ఆశించువారు:** ***Darga sb, jamat AhmadiyyaVizag (A.P)***



EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail: mdakbar1451@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817

Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక

Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA

POSTAL REG NO GDP-38/2023-2025, Vol. 10. Thursday, 16 OCT 2025, Issue No - 42

MANAGER
SHAIKH MUJAHID AHMAD
Mobile. : +91 99153 79255
e-mail managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)

(ప్రపంచ సంక్షోభము–శాంతి మార్గము: పుట 74–75)

ఇలాగే 11 జూన్ 2013వ తేదీన పార్లమెంట్ హౌస్ లండన్‌లో చేసిన ఉపన్యాసములో వారిట్లు ప్రసంగిచిరి.

"ప్రపంచ శాంతి, పరస్పరం సామరస్యము ఏర్పాటు అగుటకు చేయు కృషిలో భాగంగా అందరు ఇతరుల మతములన్నిటిని గౌరవించుట ఈ సమయపు ముఖ్యమైన అవసరము. లేనిచో భయంకరమైన ఫలితములు వెలువడును. ప్రపంచము ఒక భూగోళ గ్రామముగా మారిపోయినది. కావున పరస్పరం అమర్యాద వలన, శాంతిని ప్రోత్సహించుటకు పరస్పర ఐక్యత ఏర్పాటు కానిచో స్థానిక జనాభా లేదా నగరములకు లేదా ఏదేని ఒక్క దేశమునకు నష్టము వాటిల్లక మొత్తం ప్రపంచ వినాశనానికే ఇది దారి తీయును. గత రెండు ప్రపంచ యుద్ధముల భయంకర వినాశనము మనకందరికి మంచిగా తెలుసు. కొన్ని దేశముల విధానాల వలన మరొక ప్రపంచ యుద్ధము ముంచుకొస్తున్నది. ప్రపంచ యుద్ధము జరిగినచో సుదీర్ఘ కాలము వరకు కొనసాగే వినాశనకర ఫలితములతో పశ్చిమ దేశాలు కూడ ప్రభావితమగును. కావున తమను తాము ఈ వినాశనము నుండి రక్షించుకొనుటకు ముందుకు రండి. రాబోవు మన తరాలను యుద్ధపు విధ్వంసకర, వినాశనకర ఫలితముల నుండి రక్షించుకోందాం రండి. ఎందుకనగా ఈ యుద్ధము అణు యుద్ధమగును. ప్రపంచము వెల్తున్న దిశను చూసినచో నిశ్చయముగా ఇటువంటి మరొక యుద్ధము సంభవించే ప్రమాదము పొంచి వున్నది. ఈ భయానక ఫలితముల నుండి రక్షించుకొనుటకు న్యాయము, నీతి, నిజాయితిని అవలంభించవలెను. ప్రపంచ శాంతిని భంగపరచటుకు ప్రయత్నిస్తున్న పక్షములకు విరుద్ధంగా ఏకమై నివారించవలెను.

నా కోరిక మరియు హృదయపూర్వక ప్రార్థన ఏమనగా ఈ విషయములో పెద్ద శక్తులకు తమ బాధ్యతలు, విధులను అత్యంత న్యాయబద్ధంగా, మంచి పద్ధతిలో నిర్వర్తించుటకు అల్లాహ్ తఆలా అనుగ్రహించుగాక! ఆమీన్"

(ప్రపంచ సంక్షోభము–శాంతి మార్గము: పుట 129)

**వ ఆఖిరు దావానా అనిల్ హందులిల్లాహి రబ్బిల్ ఆలమీన్.**

---

(8వ పేజి తరువాత)

కంప్యూటర్ సైన్స్, మెడికల్ సైన్స్ మరియు టెక్నాలేజికి చెందిన ఇతర రంగాలలో కూడ మానవులకు కొంత మేరకు సఫలీకృతమును అందించాడు. ఆయా ఆవిశ్కరణలు మరియు పారిశ్రామిక రంగంలో మానవ జాతికి చెందిన ఒక వర్గానికి ఎంతటి గర్వం ఏర్పడిందనగా వారు ఏకముగా అల్లాహ్ తాలా యొక్క ఉనికినే తిరస్కరించసాగారు.

ఇలాంటి మానవులను ఉద్దేశించి అల్లాహ్ (కాహఫ్: 104–106) సూక్తులలో ఈ విధముగా హితోపదేశం చేస్తున్నాడు.

హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మరియు హుజూర్ సల్లల్లాహుఅలైహివసల్లం యొక్క మాధ్యమం ద్వారా, ప్రతి స్వచ్ఛమైన ముసల్మానుడికి ఈ సందేశాన్ని అందించడం జరిగింది. అనగా కర్మల ఆధారముగా అందరి కంటే అధికముగా నష్టపడు వారి వార్తను మేము మీకు తెలుపవలెనా? అని అడుగుము. వారి ప్రయత్నములన్నియు ప్రపంచ జీవిత కోరికలో మాయమైనవి. వారు ప్రారిశ్రామిక రంగములో నైపుణ్యమును చూపుచున్నారని వారు భావింతురు. తమ ప్రభువు సంకేతములను, అతని కలయికను నిరాకరించిన వారు వీరే. కనుక వారి కర్మలు వ్యర్థమయ్యెను. పునరుత్థాన దినము మేము వారికెట్టి ప్రాధన్యత నివ్వము.

ఈ సూక్తులలో అల్లాహ్ తాలా ఈ విధముగా తెల్పుచున్నాడు. ఇలాంటి దాంబికులు మరియు నాస్తికులు, శాస్త్రవేత్తలు వివిధ రకాల ఆవిష్కరణలు చేసినవారు తమ తమ ఆవిష్కరణల వలన, పరిశోధనల వలన ఎంతటి అహంకారానికి గురైనారు అనగా వారే తమను సర్వంగా భావించుకోసాగారు. కాని అల్లాహ్ తాలా మాత్రం అలాంటి వారికి ప్రళయదినమున ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వబడదని స్పష్టముగా తెల్పుచున్నాడు. ఎందుకనగా వారు ఈ పరిశోధనలన్నింటిని మరియు ఆవిష్కరణలను అల్లాహ్ తాలా అనుగ్రహించిన సామర్థ్యముల మేరకు చేశారు. ఈ ఆవిష్కరణలు, పరిశోధనలు వారి దృష్టిని అల్లాహ్ తాలా వైపు మరల్చుటకు బదులుగా వారిలో అహంకారాన్ని, గర్వాన్ని కల్గింపజేశాయి. ఈ అహంకార పూరిత మానవులకు అందుకు తగిన శిక్ష విధించబడును.

ఇందుకు భిన్నముగా చూసినచో అల్లాహ్ తాలా యొక్క విశ్వాస దాసులు ఎప్పుడు ఏ విధమైన ఆవిష్కరణలు చేసిన వారు ముందుగా అల్లాహ్ తాలాకు కృతజ్ఞతలు తెల్పుతుంటారు. చాలా మంది ముసల్మాను శాస్త్రవేత్తలు ఉదా॥ అల్ హమ్‌యారి, ఇబ్రాహీం అల్ఫజారి ,జాబిర్ బిన్ హయాన్, ముహమ్మద్ అల్ఫజారి, యాకూబ్ బిన్ తారీఖ్, అల్ ఖవారజమి, అబ్దుర్హ్మాన్ అస్సూఫీ, ఇబ్నుల్ హైషామ్, అల్ బేరూని, ఇబ్నే సీనా, అబ్దుర్రహ్మాన్ అల్ ఖజీని మరియు ప్రొఫేసర్ డాక్టర్ అబ్దుస్సలాం వంటి శాస్త్రవేత్తలు ఉన్నారు. వీరందరు అల్లాహ్ తాలా వారికి అనుగ్రహించిన విజ్ఞానం ద్వారా చాలా అవిష్కరణలు చేశారు అనేక ఆవిష్కరణలకు పునాదులు వేశారు. వారు అన్ని రంగాలలో మార్గదర్శకత్వం కోసం సూత్రాలు మరియు చట్టాలను కనుగొన్నారు. వాటి ఆధారంగానే యూరోపియన్ శాస్త్రవేత్తలు మరింత పురోగతి సాధించారు.

ప్రియమైన శ్రోతలారా, మీరువిన్నట్లుగా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ఉనికిని విశ్వసించడం వల్ల కలిగే ప్రయోజనాలు మరియు ఆశీర్వాదాలు ఏమిటో కూడా ఈప్రసంగంలో వివరించడం నా ఉద్దేశం. ఈ క్రమంలో అల్లాహ్ తాలాయే స్వయముగా ఈ విధముగా తెల్పుచున్నాడు.

**వ ఇన్ త ఉద్దూ నిఅమత అల్లాహి లా తుహ్సూహా** (ఇబ్రాహీం: 35) అనగా మీరు అల్లాహ్ ఇచ్చిన ఆశీర్వాదాలు మరియు అనుగ్రహములను లెక్కించాలనుకుంటే, మీరు ఎప్పటికీ చేయలేరు.

వాస్తవంఏమిటంటే, ఒక ్వ్యక్తి అల్లాహు ను విశ్వసించడం వల్ల కలిగే ప్రయోజనాలను మరియు ఆశీర్వాదాలను లెక్కించాలనుకుంటే, ఏ వ్యక్తికి కూడ లెక్కించే స్థోమత లేదు.

ఈ కొద్ది సమయంలో కొన్ని ఆశీర్వాదాలను గూర్చి వివరిస్తాను. సర్వ శక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ఉనికిపై విశ్వాసం మరియు నమ్మకం ఉన్న వ్యక్తి మరియు అతని సూచనల ప్రకారం తన జీవితాన్ని గడిపే వ్యక్తి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తెల్పినట్లుగా అతను మనస్సులో శాంతిని మరియు సంతృప్తిని అనుభవిస్తాడు. ఈ విషయాన్నే అల్లాహ్ తాలా ఈ విధముగా తెల్పుచున్నాడు. **అల్లజీన ఆమనూ వ తత్‌మ ఇన్ను ఖులూబుహుం బిజిక్‌రిల్లాహి అలా బిజిక్‌రిల్లాహి తత్‌మ ఇన్నుల్ ఖులూబ్** (అర్రాద్:29) అనగా విశ్వసించిన వారి , హృదయాలు అల్లాహ్ స్మరణతో సంతృప్తి చెందుతాయి, వినండి!. హృదయాలు అల్లాహ్ స్మరణతోనే సంతృప్తి చెందుతాయి మరియు వారు అల్లాహ్ యొక్క ప్రతి అభిష్టానికి సంతృప్తి చెందుతారు. మరియు ఇది వారి జీవితానికి ఆదర్శవంతమైన దృక్పథం అవుతుంది.

ఓ్రప్రభూ! నీఅనుగ్రహమైనా, లేక నీ పరీక్ష అయినా
నీ సంతోషమే మా సంతోషంగా ఉంటాము.

వారి ప్రభువు వారితోసంతృప్తి చెందాలనే ఉద్దేశంతోనే వారి శోధన మరియు కృషి ఉంటుంది. వారు కూడా చాలా ఓర్పుతో కష్టాలను మరియు బాధలను సహిస్తారు. వారి ఉదాహరణ ఒక రాజు మరియు అతని సేవకుడిని పోలి ఉంటుంది. ఆ ఉదాహరణలో ఇలా చెప్పుకోవడం జరుగుతుంది. పురాతన కాలంలో ఒకరాజు వద్దకు పుచ్చకాయల బుట్టను తీసుకు వచ్చారని చెబుతారు. రాజు అనుకున్నాడు. నా సేవకుడు ఇంతవరకు నాకు చాలా సేవలు చేశాడు. ఈరోజు నేను అతనికి సేవ చేస్తాను. కావున ఆ రాజు పుచ్చకాయను కోసి తన సేవకులలో ఒకరికి ఇచ్చాడు, సేవకుడు దానిని తిన్నాడు. రాజు ఆ ముక్క రుచిగా ఉందా అని అడిగాడు. అందుకు సేవకుడు ఇలా సమాధానం ఇచ్చాడు. "చాలా బాగుంది." అలా ఆ రాజు గారు పుచ్చకాయలు కోసి సేవకునికి ఇస్తూ వచ్చాడు. ఆ సేవకుడు తింటూ ఉన్నాడు. చివరిగా రాజు గారు ఒక పుచ్చకాయ ముక్కను తినగా అది చాలా చేదుగా ఉంది. ఆ రాజు గారు సేవకున్ని పిలిచి ఇలా అడిగారు నేను పుచ్చకాయ తినగా అది చాలా చేదుగా ఉంది కానీ మీరు మాత్రం దానిని చాలా ఆనందంగా తిన్నారు. పైగా నేను అడిగినప్పుడు, చాలా బాగుంది' అని మీరు చెప్పారు." ఎందుకు అలా చేసారు?. అందుకు సేవకుడు ఇలా సమాధానం ఇచ్చాడు. "రాజు మీచేతి నుండి నాకు చాలా తీపి పదార్థాలు తినిపించారు. అలాంటప్పుడు ఈ రోజు ఆ చేత్తో ఒక్క చేదు పుచ్చకాయ తినవలసి వస్తే అది బాగాలేదని ఎందుకు చెప్పాలి?. అసలైన రుచి నాకు తినిపించే ఆచేతిలో ఉంది. ఈ ఉదాహరణతో అర్థం చేసుకోవచ్చును.

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz